
# మిసిమి

మాస పత్రిక

జూలై 2000



వెల–రూ.8/-



యల్.యస్. లోరి ( 1887 - 1976 )

## చిత్రకారుని గురించి

లోరి మాంచెస్టర్‌లో 1 నవంబరు 1887లో ఏకైక సంతానంగా రాబర్ట్ స్టీఫెన్ లోరి, ఎలిజబెత్ హాబ్సన్‌లకు జన్మించాడు. తండ్రి ఎస్టేట్ ఏజెంట్, తల్లి పియానో వాయిద్యకారిణి. ఆమె స్థానికంగా కచేరీలు గూడా చేసేది. 1909 లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇప్పుడున్న వాతావరణం కంటె బాగా దిగజారిన పరిస్థితులున్న ప్రదేశమైన పెండెల్‌బరీకి మారారు.

ఈ కొత్త వాతావరణం - పూరి గుడిసెల వరుసలు, ఫ్యాక్టరీల పొగ గొట్టాలు ఆ కుటుంబాన్ని కుంగదీసాయి. కాని లోరి క్రమంగా ఆ వాతావరణానికి అలవాటుపడి గాఢమైన, స్థిరమైన మక్కువను పెంచుకొన్నాడు.

ఇక్కడే అతడు తన చిత్రలేఖనానికి కావలసిన ముడిసరుకును సేకరించుకొన్నాడు. ఈ ముడిసరుకు ఆ భయానక వికార ఉత్తర ఇంగ్లండ్ పారిశ్రామిక పరిసరం. ఇక్కడ అతడు అద్దెలు వసూలు చేసే ఉద్యోగం చేసేవాడు. అద్దెలు వసూలు చేయడానికి బయటకు వెళ్ళేటప్పుడెల్ల ఒక స్కెచ్ బుక్ వెంట తీసుకెళ్లేవాడు. అతనికి ఏదైన దీప స్తంభమో, పొగ గొట్టమో కంటబడితే, ఏదో ఒక గోడకు ఆనుకొని అక్కడకక్కడే స్కెచ్ గీసుకొనేవాడు. అవసరమైనప్పుడెల్ల ఈ స్కెచ్‌లను దృష్టిలో ఉంచుకొని పెయింట్ చేసేవాడు.

అతడు తల్లిని ఆరాధించేవాడు. ఆమె 1939లో మరణించే వరకు ఆమెతోనే ఉన్నాడు. అతడు ఆజన్మ బ్రహ్మచారిగా ఉండడంలోని ఆంతర్యాన్ని తల్లి మీద అతని రాగబద్ధతని వివరిస్తుంది.

నేను ఏకాంతంగా ఉండి ఉండక పోతే, నేను దర్శించిన దానిని దర్శించి ఉండగలిగే వాణ్ణి కాదు. తల్లి మరణం అతనిని కుంగ దీసింది. సరిగ్గా ఇదే సమయంలో అతనికి కళాకారునిగ మంచి గుర్తింపు వచ్చింది. 1967లో ఇతనికి గుర్తింపుగా ప్రత్యేక తపాల బిళ్ళను గూడ వేశారు. అతడు మొత్తం 3000 పై చిలుకు పెయింటింగ్‌లు, డ్రాయింగ్‌లు వేశాడు.

యంత్రాల నీడలో తమ హ్రస్వ జీవితాలను గడిపే ఆడ, మగ జనం ఏ అర్థం లేని కీలుబొమ్మలు. వారికి తమ జీతాల మీద అదుపు ఆధిపత్యాలు లేవు. యంత్రాల ధ్వనుల శ్రుతిలయలతో బందీలయ్యారు. వీధుల్లో ఆడుకొంటున్నారు. పేదరికం ఒడిలో సేదదీరుతారు; వీరి ఈ పారిశ్రామికీ కృత జీవితాన్ని తన కళాఖండాల ద్వారా భావి తరాలకు అందించాలని అతని తాపత్రయం.

ముఖచిత్రం : **అరుణ నేత్రుని శిరం**

భయానకమైన 'స్వీయ-చిత్రాన్ని' అతడు ఔద్వేగికంగా సంకటస్థితిలో ఉన్నప్పుడు నిర్మించాడు. అప్పుడతని తండ్రి గతించాడు. కోలుకొంటున్న తన తల్లికి అతడు పరిచర్యలు చేయవలసివచ్చింది. అనివార్యంగా పైకొంటున్న తల్లి మరణం - (వాస్తవానికి అది ఒక సంవత్సరం తరవాత వచ్చింది) - తన భావి ఏకాంతం - ఈ రెండు భయానక, విషాద విషయాలను ఈ మనస్సును ముట్టడించే కృతి ద్వారా అభివ్యక్తీకరించాడు.

# మిసిమి

"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.

సంపుటి 12 | జులై 2000 | సంచిక 7

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక

ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే
మిమ్మల్ని మీరు జయించుకోండి.. - బి. వి. రామిరెడ్డి

జీవజాతుల పునఃసృష్టి - డా. దేవరాజు మహారాజు

ప్రాచీన తెలుగు, కన్నడ సాహిత్యాలలో మానవతా రీతులు - ఆచార్య గంథం అప్పారావు

'నూతి'లో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం! - నరేష్ నున్నా

నార్ల బాట - నాగసూరి వేణుగోపాల్

హిందూ మత సంస్కర్త దయానంద సరస్వతి - శివలింగం

ఆధునికానంతర మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త జాక్‌లకా - బి. తిరుపతిరావు

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **విభాజిత జీవితాలు**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536
e-mail : misimi_m@hotmail.com
http : //www.misimi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# "VIPASSANA"

**Joint Communique by Jagadguru Shankaracharya Shri Jayendra Saraswatiji of Kanchi Kamakoti Pith and Vipassanacharya Satya Narayan Goenkaji.**

This joint communique is being issued after the cordial talk between Jagadguru Shankaracharya Shri Jayendra Saraswatiji of Kanchi Kamakoti Pith and Vispassanacharya Guruji Shri Satyanarayana Goenkaji.

Both agree and wish that there should be harmonious and friendly relations between both ancient (the Vedic and the *Sramana*) traditions. If there has been any misconception in this matter in the minds of the people of the neighbouring countries, it should be removed at the earliest.

The following was agreed:

1. Due to whatever reason some literature was written (in India) in the past in which the Buddha was declared to be a reincarnation of Vishnu and various things were written about him. This was very unpleasant to the neighbouring countries. In order to foster friendlier ties between the two communities we decide that whatever has happened in the past (can't be undone, but) should be forgotten and such beliefs should not be propagated.

2. A misconception has spread in the neighbouring countries that the Hindu society of India is organising such conferences to prove its dominance over the followers of the Buddha. To forever remove this misconception we declare that both Vedic and *Sramana* Traditions are ancient traditions of India. Both have their own prestigious existence. Any attempt by one tradition to show itself higher than the other will only generate hatred and ill will between the two. Hence such a thing should not be done in the future and both traditions should be accorded equal respect and esteem.

3. Anybody can attain a high position in the society by doing good deeds. One becomes a low (person in society) if one does evil deeds. Hence anybody can - by doing good deeds and removing the defilements such as passion, anger, arrogance, ignorance, greed, jealousy and ego- attain a high position in society and enjoy peace and happiness.

We agree on all the three things mentioned above and wish that all the people of India from all the traditions should have cordial relations and the neighbouring countries should also have friendly relations with India.

# ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే మిమ్మల్ని మీరు జయించుకోండి

*(1946 నోబెల్ సాహితీ బహుమతి పురస్కార స్వీకారోపన్యాసం)*

మూలం : **హెర్మన్ హెస్** అనువాదం : **బి.వి. రామిరెడ్డి**

అనారోగ్యం వల్ల హెర్మన్ హెస్ ఇక్కడికి రాలేకపోయారు. అయినా, ఆయన ఆలోచనలు మనతోనే ఉన్నాయి. ఆయన తరపున నేను (హెన్రీ వల్లొట్టన్; స్వీడిష్ మినిస్టర్) మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను - ''మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి నేను మీతో కలుసుకోలేకపోయినందుకు విచారిస్తున్నాను. నా ఆరోగ్యం ఎప్పుడూ అంతంతమాత్రమే. 1933 నుండి అనేకానేక సంఘటనలు, బరువైన విధులు నా ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. అయితే నామనసు మాత్రం ముక్కలు కాలేదు. నోబెల్ ఫౌండేషన్‌వారి మనసు అంతర్జాతీయమూ, అలౌకికం అనీ, అది యుద్ధాన్నీ, వినాశాన్నీ కాక శాంతినీ, సామరస్యాన్నీ పెంపొందించడానికి కృషి చేయాలని నిర్ణయించడంతో నేను ఏకీభవిస్తున్నాను.

జాతీయతా లక్షణాలను చెరిపివేయడం నా ఆదర్శంకాదు. ఆకారాల్లో, రంగుల్లో ఈ భూమ్మీద తరతరాలుగా నివసిస్తున్న భిన్నత్వం అంటే నాకిష్టం. ఎన్నో జాతుల ప్రజలు, భాషలు, విభిన్న నమ్మకాలు, దృక్కోణాలు ఉండడం ఎంత అద్భుతమైన విషయం! యుద్ధాలు, విజయాలు, ఐక్యతలు అంటే నాకసహ్యం. స్వతహాగా ఎదిగిన, వ్యక్తిత్వం గలిగిన, అనేకరకాలైన విరుద్ధ, మానవ సంస్కృతులు చీకటి శక్తుల గుప్పిట్లో చిక్కుకున్నాయి. వాటి ప్రత్యేకతల్ని నేను ప్రేమిస్తాను. కృతజ్ఞత కలిగిన మీ అతిథిగా, సహాధ్యాయుడిగా నేను మీ దేశానికీ, మీ భాషకూ, మీ సంస్కృతికీ గర్వించదగిన మీ దేశ చరిత్రకీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నేనెప్పుడూ స్వీడన్ వెళ్ళలేదు. కాని, దశాబ్దాలుగా అక్కణ్ణించి నాకు దయార్ద్రమైనవెన్నో లభించాయి. నలభై ఏళ్ళ క్రితం మీ రచయిత సెల్మాలాగర్లోఫ్ తాను రచించిన ''క్రైస్ట్ లెజండ్స్'' నాకు అంకితమిచ్చాడు. తరువాతి సంవత్సరాల్లో ఎన్నో విలువైన వాటిని మేము పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నాం. ఇప్పుడు మీరు నాకు అత్యంత విలువైన పురస్కారాన్నిచ్చి నన్నాశ్చర్య చకితుణ్ణి చేశారు. అందుకు నా ధన్యవాదాలందుకోండి.

ఈ అంగీకారానికి ముందు రాయల్ అకాడెమి అధ్యక్షులు సిగ్ఫ్రిడ్ కుర్మన్ ఇలా అన్నారు. ''హెర్మన్ హెస్ అత్యుత్తమమైన శైలితో కూడిన కథలూ, కవితలూ వ్రాశారు. 'ముందుకు పదండి, ఉన్నత శిఖరాలకెదగండి, మిమ్మల్ని మీరు జయించుకోండి' అనే జోసెఫ్ నెక్ట్ సిద్ధాంతాన్ని మనకు వినిపించారు. మనిషిగా ఉండడం అంటే బాధపడడం, మంచీ చెడులకు చేరువవడం. మనలోని స్వార్థ పరత్వాన్ని నిర్మూలించుకోగలిగితే మనం శాంతినీ, సామరస్యాన్నీ సాధించగలం. ఇదే హెస్ ఈనాటి క్రుద్ధమైన తూర్పు పశ్చిమాల మానవ జాతికిస్తున్న సందేశం. తన కథల్లో గొప్ప తాత్త్వికుడిగా, ధైర్యవంతుడైన సమకాలీన సమాజ విమర్శకుడిగా హెస్ నోబెల్ బహుమతికి అర్హతను సాధించుకున్నాడు.

**నోబెల్ బహుమతి పురస్కార ఆహ్వానం**

ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రజాభిమానాన్ని చూరగొన్న అరవైతొమ్మిదేళ్ళ జర్మనీ జాతీయుడైన హెర్మన్ హెస్‌కు ప్రధానం చెయ్యాలని నిర్ణయించబడింది. హెస్ నవలలు, కథలు, కవితలు రచించాడు. వాటిలో కొన్ని మాత్రమే స్వీడిష్ భాషలోకి అనువదించబడ్డాయి.

హెస్ ఇతర జర్మన్ రచయితల్లా కాక రాజకీయ వొత్తిళ్ళనుండి బైటపడ్డాడు. అతను మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో స్విడన్‌లో స్థిరపడ్డాడు. 1923 స్విడన్ పౌరసత్వాన్ని స్వీకరించాడు. అయితే అతణ్ణి జర్మన్‌గాను, స్వీడిష్ పౌరుడిగాను భావించడంలో పొరబాటేమీలేదు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో స్వీడన్ తటస్థదేశంగా ఉండడంతో తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించేందుకే హెస్ స్వీడిష్ పౌరసత్వాన్ని స్వీకరించాడు. ప్రస్తుతం హెస్, మాన్‌లాగే జర్మన్ సంస్కృతికి వారసుడు.

హెస్ వ్యక్తిత్వంలోని విచిత్ర లక్షణాల్ని అంచనా వేసుకోవాలంటే అతని జీవిత మూలాలను గురించి తెలుసుకోవడం అవసరం. అతను పవిత్రమైన స్వాబియన్ కుటుంబంలోంచి వొచ్చాడు. అతని తండ్రి చర్చి చరిత్రకారుడు. తల్లి ఒక మిషనరీ కూతురు. ఆమె పూర్వీకులు ఫ్రెంచివారు. ఆమె ఇండియాలో చదివింది. హెస్ బాల్యంలో చదువుకోసం మాల్‌బ్రాన్‌లోని ఒక క్రైస్తవ పీఠానికి పంపబడ్డాడు. అతడక్కడి నుండి పారిపోయి టిబిన్‌జెన్‌లోని ఒకగడియారాల షాపులోను, కొంతకాలం బాస్లిలోని ఒక పుస్తకాల షాపులోను పనిచేశాడు.

పవిత్రత మీద తిరుగుబాటు హెస్ వ్యక్తిత్వపు అట్టడుగు మూలాల్లో దాగి ఉంది. అది అతని జీవితంలోని అంతస్సంఘర్షణకు పునాది. 1914 కల్లా అతను సాహిత్యంలో లబ్ధప్రతిష్టుడయ్యాడు. హెస్ రచనల్లో మార్పులు తెచ్చిన విషయాలు రెండు అందులో మొదటిది మొదటి ప్రపంచయుద్ధం. యుద్ధ ప్రారంభంలో శాంతిని గురించి సహోధ్యాయులతో చర్చించాలనుకున్నాడు. ఒక నిరసనను లేవదీశాడు. జర్మన్ వార్తా మాధ్యమాలు అతడి మీద దాడి ప్రారంభించాయి. దాంతో అతడు ఖంగుతిన్నాడు. ఆ అనుభవంతో తాను నమ్ముతూ వచ్చిన యూరోపియన్‌సంస్కృతి కుళ్ళిపోతున్నదని గ్రహించాడు. దీనికి మోక్షమూ, ముక్తి తత్కాలాతీతమైనదైన ప్రాచ్య సంస్కృతి, తత్త్వాల నించే రావాలని ఆశించాడు. సందేహాల నుండి బయటపడేందుకు ఫ్రాయిడ్ మనస్తత్వ విశ్లేషణను ఆశ్రయించాడు.

హెస్ వ్యక్తిగత సంఘర్షణ అతని సుప్రసిద్ధ నవల ''స్టెప్పెన్ ఉల్ఫ్'' (1927)లో కనుపిస్తుంది. నిత్యమూ మానవ మనస్తత్వంలో కోరిక, హేతువుల మధ్య సంఘర్షణ వల్ల ఏర్పడే వొత్తిడిని ఈ నవలలో చిత్రించాడు. ఇల్లూ వాకిలీ లేని ఒక నిర్భాగ్యుడు జీవితంలో తోడేలు వెంటాడ బడినట్లు ఎలా వెంటాడబడ్డాడో పోయెటిక్‌గా, హాస్యభరితంగా చిత్రించాడు. ఆధునిక మానవ సమస్యల్నే గాక హెస్ జర్మన్ సాహిత్యపు వారసత్వాన్ని ఈ నవలలో కొనసాగించాడు.

హెస్ తల్లివేపు తాత గుండర్ట్ ప్రసిద్ధుడైన ఇండాలజిస్టు. ఆవిధంగా బాల్యంలోనే హెస్ హిందూదేశపు ఆర్ష జ్ఞానం చేత ఆకర్షితుడయ్యాడు. పరిపక్వమైన మనిషిగా ఎదిగాక ఇండియాలో పర్యటించాడు. జీవిత సమస్యలకు పరిష్కారాన్ని అక్కణ్ణించే సాధించుకోవాలని ఆశించాడు. త్వరలోనే అతని ఆలోచనా ప్రపంచం బౌద్ధమతం వల్ల ప్రభావితం అయింది. ఫలితం అతని నవల ''సిద్ధార్థ(1922)''. ఇది ఒక బ్రాహ్మణ యువకుడి జీవన సాఫల్యపు అన్వేషణకు సంబంధించిన కథ.

హెస్ సాహిత్యం మీద బౌద్ధమతం, సెయింట్ ఫ్రాన్సిస్, నీషే, డోస్టవస్కీల ప్రభావం వుంది. ప్రాథమికంగా హెస్ అనేక తాత్త్విక చింతనలతో ప్రయోగాలు చేశాడని కొందరు భావిస్తారు. ఇది నిజం కాదు. అతడు నిజాయితీగా, సీరియస్‌గా సాహితీ సృజనచేశాడు. అతని నవలికలు బాహ్యంగాను, అంతరంగికంగాను అతని వ్యక్తిత్వంతో అనుసంధించినవే. అతని శైలి అభిమానింపతగింది.

1943లో హెస్ రచించిన ''మాజిస్టర్ లూడి'' ప్రత్యేకంగా ఎన్నదగిన గ్రంథం. ఇది మేధో సంస్కృతీ పరంపరను గురించిన ఒక విచిత్ర కల్పన. సంస్కృతిలో ఆటయొక్క ప్రాధాన్యత వర్ణించబడింది. సంస్కృతీ సౌధాలు కూలుతున్న తరుణంలో సాంస్కృతిక వారసత్వాన్ని నిలిపేయత్నం పవిత్రమైనదే. అయితే సంస్కృతిని శాశ్వతంగా బ్రతికించి ఉంచడం కోసం దాన్ని ఏ కొద్ది మందికో చెందిన 'కల్ట్'గా ఉంచడం సాధ్యమయ్యే పనికాదు. అలాంటి ప్రయత్నం జ్ఞానవైచిత్రిని నిరాకారమైన ఒకసూత్రంగా మార్చడం అవుతుంది. ఉన్నత జ్ఞానం అనేదాన్ని శాశ్వతంగా భావించరాదు. అదిగాజు ముత్యంలా సుకుమారమైనది. ఊరికే ముక్కలైపోతుంది. హెస్ తన రచనోద్దేశ్యాన్ని వివరిస్తూ - 'బాధ్యత లేని మనుషులకు కనుపించని వాటిని గురించి బాధ్యతా రహితంగా వర్ణించడం తేలిక. అందుకే పవిత్రులూ, విజ్ఞులూ అయిన చరిత్రకారులు తద్భిన్నంగా చెప్పవలసి ఉంటుంది. మాటలు వర్ణనను నాశనం చేస్తాయి. అందుకే వారు కొన్ని నిరూపణలకు నిలిచేవీ నిలువని వాటిని మనుషుల కళ్ళుముందుంచుతారు' - అన్నాడు.

రచయితగానే కాక కవిగాకూడ హెస్ ఎన్నదగినవాడు. రిల్కే, జార్జిల తరువాత ప్రస్తుతపు ప్రసిద్ధ జర్మన్ కవిగా హెస్‌నే చెప్పుకోవలసి వుంటుంది. శుద్ధమైన శైలికి హృదయాన్నీ, సంగీతాన్నీ యిచ్చిన ఘనత హెస్‌కే దక్కుతుంది. అతడు గెథె, ఈచెండార్ఫ్, మూరికెల స్థాయికి చెందిన కవి. 'ది సోలేస్ ఆఫ్ నైట్' హెస్ అంతర్నాటకాన్నే గాక అతని ఆరోగ్య అనారోగ్య లక్షణాలను, తీవ్రమైన అతని అంతశ్శోధనను, జీవితానికి అతని అర్పణను, చిత్రణలోని ఆనందాన్ని, ప్రకృతి ఆరాధనని తెలియజేస్తుంది. అతని తరువాతి సంకలనం ''న్యూ పోయెమ్స్'' (1937). ఇది అతని జ్ఞానానికి విషాదానుభవాలకీ దర్పణం.

ఈ సంక్షిప్త ప్రస్తావనలో అతనిలో మారుతూ వొచ్చిన అనేకానేక లక్షణాలను వివరించడం సాధ్యమయ్యే పనికాదు. అతనొక సమస్యాత్మక నివేదనా కవి; వ్యక్తిత్వమూ, పవిత్రత కలిసి వున్న కవి. నిరసన, పోరాట దృష్టి కలిగిన భావకవి. ఒకచోట అతనే అంటాడు - రచయిత, కవి కేవలం నిజంతోనే తృప్తి పడకూడదు. చేదు సత్యాన్ని మార్చాలంటే మన ఉన్నత శక్తిని ఉపయోగించాలి, నిరసించాలి.

హెస్‌కిచ్చే ఈ పురస్కారం ఒక మంచి మనిషి ఓ జీవితకాలం నమ్మకం కోసమూ, మానవత్వం కోసమూ కవిత్వపరంగా అతను సాధించిన ఔన్నత్యానికే. దురదృష్టవశాత్తు అనారోగ్యం వల్ల హెస్ స్టాక్‌హోమ్‌కు వచ్చి, స్వయంగా ఈ పురస్కారాన్ని స్వీకరించలేక పోతున్నారు. గౌరవనీయ ప్రతినిధులైనమీరు మా చక్రవర్తి గారి చేతుల మీదుగా మా స్వీడిష్ నోబెల్ పురస్కారాన్ని హెస్‌కు బదులుగా స్వీకరించవలసినదిగా అర్థిస్తున్నాను.

- ఏండర్స్ ఆస్టర్లింగ్, శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి.

## జీవిత చరిత్ర

నేను 1877 జూలై 2న బ్లాక్‌ఫారెస్టులోని క్లాలో జన్మించాను. మా నాయన ఎస్టోనియా నించి వొచ్చిన బాల్టిక్ జర్మన్. మా అమ్మ స్వాబియన్ కుటుంబపు ఆడపడుచు, ఫ్రెంచిస్విస్. మా నాన్నగారి నాన్నగారు డాక్టరు. మా అమ్మ నాన్నగారు మిషనరీ, ఇండాలజిస్టు. మానాన్న కూడా కొద్దికాలం పాటు ఇండియాలో మిషనరీగా పనిచేశాడు. మా అమ్మ యౌవనంలో ఇండియాలో చాలా సంవత్సరాలు మిషనరీ కార్యక్రమాల్లో పాల్గొన్నది.

1880-86ల మధ్య కాలంలో బాస్లిలో ఉన్నాను. మా కుటుంబం అనేక జాతీయతల కలయిక. పైగా నేను రెండు జాతుల ప్రజల మధ్య, రెండు ప్రాంతీయ భాషల మధ్య పెరిగాను. నేను ఎక్కువ సంవత్సరాలు వెటెన్ బర్గ్‌లోని బోర్డింగ్‌స్కూలులోను, కొంతకాలం మాల్‌బ్రోన్‌లోని మతపీఠంలోను గడిపాను. నేను బాగా నేర్చుకునే స్వభావం కలవాడిని. లాటిన్, గ్రీకు భాషలు నేర్చుకున్నాను. నేను బుద్ధిమంతుడైన బాలుణ్ణి కాను. అందుచేత నా వ్యక్తిత్వాన్ని ముక్కలు చేసుకుంటూ ఆ పవిత్ర సంస్థల వ్యవస్థలో ఇమడలేక పోయాను. పన్నెండేళ్ళ వయసునించే కవిని కావాలనుకున్నాను. స్కూలు విద్య పూర్తి చేసుకుని బయటపడ్డాక ఏం చేయాలో పాలుపోలేదు. సెమినరీ గ్రామర్ స్కూలు నుండి బయట పడ్డాక ఒక మెకానిక్ దగ్గర సహాయకుడిగా చేరాను. పంధొమ్మిదేళ్ళ వయసులో బాస్లిలోని ఒక పుస్తకాల షాపులో పనిచేశాను. 1899లో నా కవితా సంకలనం అచ్చయింది. తరువాత మరికొన్ని ఇతర రచనలు కూడా అచ్చయ్యాయి. 1904లో నేను రచించిన ''పీటర్ కామెజిండ్'' మంచి పేరు తెచ్చింది. అప్పుడేనేను బాస్లికి చెందిన ఒక స్త్రీని వివాహం చేసుకున్నాను. పట్టణాన్ని వొదిలి పల్లెవాసం ప్రారంభించా. ఆ రోజుల్లో పట్టణాలకు దూరంగా ప్రశాంతమైన పల్లెవాతావరణంలో జీవించడం నాధ్యేయంగా వుండేది. అప్పట్నించి 1912 దాకా పల్లెల్లోనే నివసించాను.

1912లో నేను స్విట్జర్లాండులో స్థిరపడ్డాకమొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. దాంతోనే జర్మన్ జాతీయతతో ఘర్షణ ప్రారంభమయింది. యుద్ధాన్ని, హింసను నిరసించినందుకుగాను జర్మనీ నుండి ఉత్తరాల ద్వారా నా మీద తిట్లదాడి ప్రారంభమయింది. ఆ పరిస్థితుల్లోనే నాకు ప్రఖ్యాత ఫ్రెంచి మానవతావాది రోమారోలాతో స్నేహం కుదిరింది. ఆ స్నేహం రోమారోలా మరణం దాకా కొనసాగింది. నాలాగే ఆలోచించే ఇండియా, జపాన్‌లకు చెందిన మేధావులు నాతో తమ

అభిప్రాయాలను పంచుకున్నారు. హిట్లర్ పతనం తరువాత జర్మనీలో నాకు గౌరవం పెరిగింది. కాని, నాజీలు నా పుస్తకాల్ని ధ్వంసం చేశారు. 1923లో నేను స్విడన్ పౌరసత్వాన్ని స్వీకరించాను. నా మొదటి వివాహం విచ్ఛిన్నమయ్యాక చాలా సంవత్సరాలు ఒంటరిగా జీవించాను. నేను మళ్ళీ పెళ్ళిచేసుకున్నాను. నా మిత్రులు మొంటానోలాలో నాకొక ఇంటిని అమర్చారు.

1914దాకా నాకు ప్రయాణం అంటే ప్రేమ. నేను తరచుగా ఇటలీకి వెడుతుండే వాణ్ణి. ఒకసారి నేను ఇండియాలో కొన్ని నెలలు గడిపాను. ఆ తరువాత నేను ప్రయాణాల్ని మానుకున్నాను. పది సంవత్సరాల పాటు స్విట్జర్లాండు నుండి బయటికి అడుగుపెట్టలేదు. పదకొండు సంవత్సరాలపాటు నాపుస్తకం ''మాజిస్టర్ లూడి'' (1943) రచనలో గడిపాను. ఆ పుస్తకరచన తరువాత నాకు కంటి జబ్బుతో పాటు వృద్ధాప్యం ముంచుకొచ్చింది.

పాశ్చాత్య తత్త్వవేత్తలలో ప్లేటో, స్పినోజా, షొపెన్‌హార్, నీషే, జాకబ్ బుర్క్‌హార్ట్ నన్ను ప్రభావితం చేశారు. అయితే వారు ఇండియన్, చైనీస్ తాత్త్విక చింతనలు ప్రభావితం చేసినంతగా నన్ను ప్రభావితం చేయలేక పోయారు. నాకు ఫైన్ ఆర్ట్స్‌తో ఎప్పుడూ మంచి ప్రవేశం ఉంది. నా దృష్టిలో నా పుస్తకాలు ''కల్టివేటెడ్ పోయెమ్స్'' ''డెమియన్'', ''సిద్ధార్థ'', ''స్టెప్పెన్ వుల్ఫ్'', ''మాజిస్టర్ లూడి'', ''నార్జిస్ అండ్ గోల్డ్ మండ్'', ''ది జర్నీ టు ది ఈస్ట్'' ముఖ్యమైనవి. ''రిమిని సెన్సెస్'' ఒక విధంగా నా ఆత్మకథ. రాజకీయాల మీద నేను వ్రాసిన వ్యాసాలు, వార్ అండ్ పీస్ ఈ మధ్యనే అచ్చయ్యాయి.

నా గురించిన ఈ చిన్న జీవిత చిత్రణతో సంతృప్తి పడవలసినదిగా అర్థిస్తున్నాను. పూర్తి వివరాలు విపులంగా వ్రాయడానికి నా ఆరోగ్యం అనుమంతించడం లేదు.

హెర్మన్ హెస్ (1877-1962) 1946లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో గెథె పురస్కారాన్ని, జర్మన్ బుక్‌సెల్లర్స్ శాంతి బహుమతిని 1955లోను అందుకున్నాడు. హెస్ సంపూర్ణ సాహిత్యం ఆరు సంపుటాలుగా 1952లో అచ్చయింది. ఏడవ సంకలనాన్ని 1957లో ప్రచురించారు. 1955లో ప్రచురించబడ్డ ''ఇవోకేషన్స్''లో రోమారోలాతో హెస్ ఉత్తర ప్రత్యుత్తరాలతో బాటు ఇతర వచన రచనలు చేర్చబడ్డాయి.

---

**"I've got to be careful about what I say. I may be killed if I name the Indian player who tried to coerce me into throwing a match."**

**Dean Jones, former Australian batsman, in an interview to Australian Television**

**(- India Today)**

★

**The word (retirement) doesn't exist. It is only for people working in companies. - V S Naipaul.**

# జీవజాతుల పునః సృష్టి

– డా. దేవరాజు మహారాజు

ఇరవయ్యవ దశాబ్ది చివరి దశకం, జన్యు - జీవరసాయనిక శాస్త్రాలలో అనూహ్యామైన మార్పులు తెచ్చింది. తన వారసత్వ సంపదగా ఇరవై ఒకటవ శతాబ్దానికి 'క్లోనింగ్' పద్ధతినిచ్చింది. డాలీ గొర్రెను సృష్టించింది. మానవుడికి పునఃసృష్టి చేయగల అమోఘమైన మేధో సంపద నందించింది. భవిష్యత్తులో ఇది ప్రతి సృష్టి చేయగల చేవగా మారినా ఆశ్చర్యపోనవసరంలేదు. ప్రపంచం నలు మూలల నుండి క్లోనింగ్ ప్రయోగాలు విజయవంతమౌతున్నాయన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. ఆ నేపథ్యంలోంచి కొన్ని సంఘటనల్ని పరిశీలిద్దాము.

అది సైబీరియా ప్రాంతం! ఆర్కిటిక్ వలయానికి ఉత్తర దిశగా ఖటంగా పట్టణానికి 500 మైళ్ళ దూరంలో ఒక మంచు గుహ, అక్కడి ఉష్ణోగ్రత మైనస్ 40 డిగ్రీలు. ఎముకలు కొరికే చలికాదు. ఎముకల్ని మండించే చలి. అందులో గడ్డకట్టుకు పోయిన 23 టన్నుల నల్ల బురద!! దాన్ని బెర్నార్డ్ బైగస్ సాహసోపేతంగా, ప్రాణాలకు తెగించి పగలగొట్టాడు. ప్రపంచానికి ఒక అద్భుతాన్ని అందించాడు. 20 వేల యేళ్ళ క్రితం చనిపోయిన ఒక ఏనుగును **(Jarkov Mammoth)** బయటపెట్టాడు. (ఇది ఈ కాలపు ఏనుగువలె ఉండదు. ఏనుగువలే ఉండే పూర్వకాలపు జంతువు అని అర్థం చేసుకోవాలి. జార్కోవ్ అంటే ఆ ప్రాంతం పేరు.) ఆ చలిలో ఆ మంచులో మానవ శరీరంలోని ఏ భాగమైనా సరే భస్మమైపోతుంది. తమను తాము కాపాడుకుంటూ మంచు గుహ తొలవడమన్నది సామాన్యులతో అయ్యే పనికాదు. బెర్నార్డ్ బైగస్ జీవశాస్త్రవేత్తకాదు. ధృవ ప్రాంత అన్వేషకుడు.

అతి పురాతనమైన గజరాజు శరీరం మంచు గుహలోంచి బయటపడిందని తెలియగానే పలు అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు దానిపై పరిశోధనలు చేయడానికి ముందుకు వచ్చాయి. 25 మంది శాస్త్రజ్ఞుల బృందం కొన్ని ప్రాథమికపరిశోధనలు చేసి మొదట కొన్ని ముఖ్యమైన వివరాలు వెల్లడించాయి. అది బొచ్చు ఏనుగని **(Wooly Mammoth)** 47 యేళ్ళ ప్రాయంలో చనిపోయి ఉంటుందని, బహుశా అది మగ జంతువై ఉంటుందని, నీటిలోని మొక్కలు, గడ్డి తినడానికి వెళ్ళి దిగిపోయి ఉంటుందని, బరువైన తన శరీరాన్ని పైకి ఈడ్చలేక బురదలో కూరుకు పోయి చనిపోయి ఉంటుందని వారు ఊహిస్తున్నారు. ఇప్పుడు దాని వెంట్రుకల నుండి, జీవ కణాల నుండి DNA వేరుచేసి, క్లోనింగ్ ద్వారా ఆ జంతువును పునః సృష్టి చేయాలని ఆశపడుతున్నారు. ఈ DNAను అదే జాతికి చెందిన ఏనుగుల గర్భకోశాల్లో ప్రవేశపెడుతూ - మూడు తరాల ఏనుగుల్ని పుట్టించిన తర్వాత, అంటే- సుమారు 50 యేళ్ళ తర్వాత ఇప్పుడు మంచు గుహలో దొరికిన ఈ పురాతన గజరాజు వంటి ఏనుగు సృష్టింప బడుతుందని వారి అంచనా. ఈ పరిశోధక బృందంలో నటాషా మల్గైనా అనే మహిళా జంతు శాస్త్రవేత్త కూడా ఉన్నారు.

ఖటంగా - అదే పేరుతో వున్న ఒక నదీ ముఖ ద్వారంలో వున్న పట్టణం. ఆ నది సంవత్సరంలో తొమ్మిది నెలలు గడ్డ కట్టుకు పోయి ప్రక్కన వున్న మంచు కొండలలో కలిసిపోతుంది. నీటి మట్టం

పైన ఇంకా పది అడుగుల మంచు పెరుగుతుంది. టైమర్ ద్వీపకల్పం (Taymyr Peninsula) మొత్తానికి ఖటంగా పట్టణమే పరిపాలనా కేంద్రం. ఫ్రాన్స్ కన్నా కొంచెం పెద్ద ప్రదేశం. ఒకప్పుడు ఇది పురాతన ఏనుగుల నిలయం. క్రీ.పూ. 8వేల సంవత్సరంలో, హిమ యుగంలో అకస్మాత్తుగా అవి వేల సంఖ్యలో చనిపోయాయి. ఇప్పుడు మంచు గుహలో లభించిన జార్కోవ్ ఏనుగు అప్పటిదే! ఆ ప్రాంత వాసులకు యుగయుగాలుగా ఏనుగుల దంతాలు, ఎముకలు విరివిగా లభిస్తున్నాయి. వారు ఇంతకాలం వాటితో వ్యాపారం చేశారే తప్ప, వాటిపై పరిశోధనలు చేయవచ్చునన్న ఆలోచన ఎవరికీ రాలేదు.

డాలీ గొర్రె సృష్టికర్త డా. ఇయాన్ విల్మట్ 1997లో జీవ పరిశోధనా రంగంలో విజయ దుందుభి మ్రోగించిన ఒక సంవత్సరం తర్వాత, మంచు గుహలో ఈ పురాతన బొచ్చు ఏనుగు బయట పడింది. ఖటంగా పట్టణ నివాసి సిరియన్ జార్కోవ్ అనే యువ డోల్గాన్ (ఆ ప్రాంతవాసుల్ని డోల్గాన్స్ అంటారు) అక్కడికి 150 మైళ్ళ దూరంలో ఉత్తర దిశలో వున్న నోవరిబ్నోయ్ అనే తన స్వగ్రామానికి బయలుదేరాడు. అక్కడ అతని కుటుంబం ఉంటోంది. కుటుంబాన్ని చూడడానికి బయిలుదేరిన ఆ యువకుడు మార్గమధ్యంలో టూండ్రా వనాలలో జింకల్ని (Rein Deer) ఇతర జంతువుల్ని వేటాడుతూ వెళ్ళాలనుకున్నాడు. ఆ ప్రయత్నంలో ఒక చోట మంచులోంచి పొడుచుకొచ్చిన ఆరడుగుల ఏనుగు దంతాల్ని పసిగట్టాడు. వాటి సంగతి అతడికేమీ అంతుపట్టలేదు. అతని సోదరుడు గిన్నాడీకి విషయం చెప్పాడు. అతడు వెంటనే అక్కడ టైమూర్ నేచర్ రిజర్వ్ డైరెక్టర్ యూరి కార్పోనోవ్‌కు తెలియజేశాడు. అప్పటి నుండి ఎన్నో బృందాలు హెలికాప్టర్‌లలో ఆ ప్రాంతానికి చేరుకోవడం జరుగుతోంది. 1998 - 2000 మధ్య కాలంలో అక్కడ పరిశీలనలు, పరిశోధనలు విస్తృతమయ్యాయి.

మంచు సమాధిలోంచి ఏనుగు శరీరాన్ని బయటకి తేవడానికి ప్రయత్నించిన బెర్నార్డ్‌బైగస్ 3 అడుగుల పొడవున్న ఏనుగు వెంట్రుకను Hair Dryer సహాయంతో మంచులోంచి బయటకి తీయగలిగాడు. అదీగాక ఏనుగు క్రింద దవడ భాగానికి అంటుకొని వున్న ఎర్రటి పుష్పాల్ని కూడా జాగ్రత్తగా వెలికి తీయగలిగాడు. అంటే ఏనుగుతో పాటు 20 వేల యేళ్ళనాటి అడవి పుష్పాలు కూడా లభ్యమయ్యా యన్నమాట! ఒక శతాబ్ది కాలంగా ప్రపంచ శాస్త్రవేత్తలెవరూ సాధించనిది బెర్నార్డ్‌బైగస్ సాధించగలిగాడని ప్రముఖ శాస్త్రవేత్తలంతా ఆయన కృషిని శ్లాఘించారు.

మంచు గుహల్లోంచి ఏనుగుల కళేబరాలు బయటపడడమన్నది ఇదే ప్రథమం కాదు. 1806లో, 1901లో, 1977లో కూడా బయటపడ్డాయి. అయితే వాటిపై పరిశోధనలు జరగలేదు. వాటి శరీరాల్ని ముక్కలుచేసి మ్యూజియంలకు తరలించారు. లేదా దంతాలతో, ఎముకలతో వ్యాపారంచేసుకున్నారు. శాస్త్రీయంగా ఒక అవగాహనకు రావడం ఇదే ప్రథమం. అయితే క్లోనింగ్ విషయంలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. 'దీనితో క్లోనింగ్ జరుపడం సాధ్యంకాదు' అని అన్నాడు రష్యన్ ప్రొఫెసర్ నికోలాయ్ విరశ్చగిన్. ఆయన 90 యేళ్ళ వృద్ధుడు. క్షీరదాలమీద ముఖ్యంగా ఏనుగు జాతుల మీద ప్రత్యేకంగా కృషిచేసి వంద గ్రంథాలు రాసినవాడు. కాని ఇతర వైజ్ఞానికులు ముఖ్యంగా డాలీ సృష్టికర్త డా. ఇయాన్ విల్‌యమట్ 'అందుబాటులోకి వస్తున్న అద్భుత సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానం వల్ల క్లోనింగ్ సాధ్యమౌతుంది.

అంతరించిపోయిన ఆ ఏనుగు జాతిని మళ్ళీ సృష్టించ వచ్చు' అని నమ్మకంగా చెబుతున్నాడు. ఇప్పటికే ఏనుగు కణజాలాల (Tissue), నమూనాలు (Sample) హవాయ్, లయోన్‌లలోని అత్యాధునిక వైజ్ఞానిక పరిశోధనాలయాలకు పంపించారు. అక్కడ DNA వేరుచేయించారు. అది అసంపూర్ణంగా లభించింది. అయినా నిరాశపడక అసంపూర్ణ DNAతోనే 1999లో ఆసియా ఆడ ఏనుగుకు కృత్రిమ గర్భధారణ చేయించారు.

DNA అసంపూర్ణంగా వున్నందువల్ల జన్యు శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి, డాలీ గొర్రె విషయంలో చేసినట్టుగానే న్యూక్లియస్ మార్పిడి క్లోనింగ్ పద్ధతులు అమలు పరచగలరా లేదా అన్నది అనుమానంగా ఉంది. అందుకే ప్రత్యామ్నాయంగా కృత్రిమ గర్భధారణ పద్ధతిని ఎన్నుకున్నారు. ఈ విధంగా మూడు తరాల ఏనుగుల్ని సృష్టించ గలిగితే, మూడోతరంలో వచ్చే ఏనుగు 88 శాతం ఇప్పుడీ మంచు గుహలో దొరికిన బొచ్చు ఏనుగు అవుతుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఇందులో 100 శాతం వీలుకాదు. ఎందుకంటే ప్రయోగానికి ఉపయోగించుకొన్నవి- పరిణామరీత్యా ఆధునికతను సంతరించుకొన్న ఇప్పటి ఆడ ఏనుగులు గనుక!

ఇలాంటి ప్రయత్నమే ఆస్ట్రేలియాలో కూడా జరుగుతోంది. అక్కడ 1936లో అంతరించిపోయిన 'టాస్మానియన్ టైగర్'ను పునః సృష్టించడానికి అక్కడి శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నారు. 'టాస్మానియన్ టైగర్' అంటే పులి కాదు. తోడేలు జాతికి చెందిన జంతువు (Marsupial Wolf-Thylacine) టైగర్- అనేది ఆ ప్రాంత వాసులు దానికి పెట్టుకున్న ముద్దు పేరు.

సిడ్నీలోని ఆస్ట్రేలియన్ మ్యూజియంలో అప్పుడే పుట్టిన టాస్మానియన్ టైగర్ పిల్ల భద్రపరచబడి ఉంది. దానిని పూర్వపు శాస్త్రజ్ఞులెవరో 1866లో ఆల్కహాల్ నింపిన గాజు జార్‌లో భద్రపరిచి వుంచారు. భవిష్యత్ తరాల వారి అధ్యయనంకోసం మ్యూజియంలలో అలా చేయడం మామూలు విషయమే! కాని ఇప్పుడు పరిస్థితి మారింది. కేవలం అధ్యయనం కాదు - ఆ తోడేలు పిల్ల శరీర భాగాల్లోంచి DNA వేరుచేసి, ఆ జాతి తోడేళ్ళను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆస్ట్రేలియన్ మ్యూజియంలోని పరిణామ జీవ శాస్త్ర విభాగానికి అధిపతి అయిన డా. డాన్ కోల్గన్ నేతృత్వంలో జార్‌లోని తోడేలు పిల్ల గుండె, కాలేయం, కండరం, ఎముకల మూలుగల నమూనాలు తీశారు. అందులోంచి DNA వేరుచేశారు. అందులోంచి టాస్మానియన్ టైగర్ జాతుల జన్యువులన్నింటి కాపీలను సాధించగలిగారు. ఈ పనంతా ఏప్రిల్, 2000 మాసంలో జరిగింది. ఇక క్లోనింగ్ జరిపి, ఆ జాతి జంతువులకు మళ్ళీ ప్రాణం పోసే ప్రయత్నాలు జరగాల్సి వుంది. తమకు లభించిన DNA సంపూర్ణమైనదేకాక, జన్యువుల కాపీలు కూడా ఉన్నందున ప్రయోగం విఫలమైయ్యే ప్రసక్తి లేదని, టాస్మానియన్ టైగర్ సృష్టి తథ్యమని - ఆస్ట్రేలియన్ శాస్త్రజ్ఞులు తమ బలమైన విశ్వాసాన్ని వ్యక్తీకరిస్తున్నారు. అంతరించి పోయిన జంతువు శరీరం నుండి జన్యువుల్ని వేరుచేసి, ఆ జాతిని పునరుద్ధరించడం - ప్రపంచ జీవ శాస్త్ర చరిత్రలో ఇదే ప్రథమం అవుతుందేమో... వేచి చూడాలి!

(ద టైమ్స్, టెలిగ్రాఫ్, లండన్ పత్రికల సౌజన్యంతో)

# ప్రాచీన తెలుగు, కన్నడ సాహిత్యాలలో మానవతా రీతులు

- ఆచార్య గంథం అప్పారావు

''మాటలు వేరైనను కానీ
మార్గాలు వేరైనా
మానవాళి సుఖశాంతులకూ
మానవతావాదం ఒకటే
మహనీయులు ప్రవచించిన ఆ
మానవతా వాదం ఒకటే*

**"Man is the measure of all things"** (మానవుడే అన్ని విషయాలకూ ప్రమాణం అని చెప్పిన (గ్రీకు దార్శనికుడు (ప్రోటగోరస్) ప్రోటగోరస్ మానవతావాదాన్ని ఒక తత్వంగా ఆలోచన చేసిన ప్రసిద్ధాచార్యుడు. ఈతడు క్రీ.పూ. 485-415 ప్రాంతంలో ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది. ఈతని మొట్టమొదటి గ్రంథం ట్రూత్ **(Truth)** పుస్తకం మొదటి లైనే ఈ మాట **(Man is.... all things)** అరిస్టాటిల్ తత్వశాస్త్రంలోని కొన్ని భాగాలను నిరాకరిస్తూ వ్రాసిన గ్రంథమే ఈ ట్రూత్. సత్యానికి **obsolute standard** లేదని గట్టిగా చెప్పిన దార్శనికుడు ప్రోటాగోరస్.

అరిస్టాటిల్ తత్వశాస్త్రం సిద్ధాంతరీత్యా భావవాదమైనా భౌతిక ప్రపంచ వాస్తవం పైనా, మానవుని అపారశక్తి, సంపదపైనా పూర్తిగా నమ్మకమున్న భావవాది. ఈతని మానవతాదృష్టి ప్రోటాగోరస్ దృష్టికి భిన్నమైంది.

ప్రోటాగోరస్ మానవతావాదానికి ముఖ్య సిద్ధాంతాలివి: 1. హేతు యుతమైన వివేకం 2. మానసిక స్పందన 3. విలువల ఎన్నికలలో స్వాతంత్ర్యం 4. త్రికరణ శుద్ధి 5. వ్యక్తి స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది.

ఈ నాడు వైజ్ఞానిక ప్రభావంతో మానవ సమాజాన్ని అధికతరమైన సౌఖ్యానికీ, ఆనందానికీ తోడ్పడిందే నిజమైన మానవతావాదం ప్రోటాగోరస్ మానవతాదికాడని అతని సిద్ధాతాలే మనకు చెబుతున్నాయి.

ప్రోటాగోరస్‌కు ముందూ వెనుక ఎంత గొప్ప మానవతావాదులు పుట్టినా 'మానవతా వాదం' అనే సరికి ప్రోటాగోరస్సే ముందుగా మనకు జ్ఞప్తికి వస్తాడు. ఎందుకంటే ఈతడొక్కడే మానవతావాదాన్ని ఒక తత్వంగా **(Philosophy)**గా ఆలోచించాడు తక్కిన వారలా ఆలోచించలేదు.

గౌతమ బుద్ధుడు ఎప్పుడో 6,5 శతాబ్దాలోనే మానవతావాదాన్ని విశ్వమానవలోకానికందించాడు.

అహింసా ధర్మానికీ, సహేతుక దృష్టికీ, కరుణ, ప్రేమలకూ, సమసమాజ నిర్మాణానికీ, శీల సంపదకూ బుద్ధుని మానవతావాదం పట్టాభిషేకం చేసింది. 'బహుజన సుఖాయ, బహుజన హితాయ' అన్నదే బౌద్ధ ధర్మం.

---

* మానవతావాదం, ఆచార్య గంథం అప్పారావు.

తర్వాత క్రీ॥ పూ॥ 469-399లో జీవించిన మహోన్నత తత్వవేత్త సోక్రటీస్ మనహృదయ నేత్రాలకు కనిపిస్తాడు. ఈ మహాపురుషుడు మానవతా విలువలను ప్రదర్శించి, సత్య ధర్మాలకై అసువులర్పించిన ధీరోదాత్తుడు. సోక్రటీస్ తాత్విక సిద్ధాంతాలను ఆయన శిష్యరత్నాలైన ప్లేటో మొదలైన వారు విశ్వవ్యాప్తి గావించారు.

బుద్ధుని తర్వాత సరిగ్గా 563 సంవత్సరమున ఏసుక్రీస్తు అవతరించాడు. ఈతడు పుడమి కవతరించిన దేవ దూత అని క్రైస్తవుల పరిపూర్ణ విశ్వాసం. ఈ మహోన్నత మానవతా మూర్తి మానవాళికి బోధి ంచిన సూత్రాలివి : నీ పొరుగు వారిని ప్రేమించు దయా దాక్షిణ్యాలతో, క్షమాగుణ సంపన్నులై ప్రశాంత జీవితాన్ని నడపండి ఎంత పాపులైనా పశ్చాత్తాపము పొందిన వారిని ప్రేమతో ఆదరించండి. ప్రేమ సూత్రాన్ని ఆరాధించండి. అని ఎన్నో మానవతాధర్మాలను బోధించాడు కరుణా సముద్రుడు.

మహమ్మద్ కూడా ఈ ధర్మాలనే బోధించాడు. ఈ మహాపురుషుని ధర్మాలలో సాంఘికసమభావన అత్యంత ముఖ్యమైంది.

ఇంకా ఎందరో మత ప్రవక్తలు, ప్రపంచ సాహిత్య విధుల్లో విక్టర్ హ్యూగో లాంటి సాహిత్య సుధాకరులు మానవతారీతుల్ని ప్రపంచం నలుమూలలా వెదజల్లారు 'మానవత అనండి, మానవతావాదం అనండీ భావం ఒకటే (kindness to all human beings) నేనొక చోట చెప్పినట్లు.

'' ఆదర్శ వాదం కానివ్వండీ, భౌతిక వాదం కానివ్వండీ, ఆస్తికనాస్తికాలలో ఏ తాత్విక సిద్ధాంతానికి చెందిన వారైనా మన కభ్యంతరం లేదు. అది మానవుని మానసికాభి వృద్ధికీ, అతని పురోగమనానికీ తోడ్పడాలి. మానవ లోకానికి సుఖశాంతులు ప్రసాదించిందే వాదం, నాదం, సిద్ధాంతం, తత్వం.

ప్రస్తుతం అసలు విషయానికి వద్దాం. ప్రాచీన ఆంధ్ర, కన్నడ సాహిత్యాలలో మానవతా రీతులు వెదజల్లిన మహాపురుషులను గూర్చి తెలుసుకొందాం.

తెలుగు ప్రాచీన సాహిత్యంలో నన్నయ మొదలు శ్రీనాథుని యుగం వరకు వెలువడిన కావ్యాలన్నీ వైదికమత ప్రచార దృష్టితో రచించినవే. ఈ సాహిత్యంలో సామాన్య జనుల కష్టసుఖాలకు సంబంధించిన విషయాలకు చోటులేదు. ఎంతసేపూ దేవతామహాత్యాల గురించి వారి శక్తుల గూర్చి, అవతారాల గూర్చి చెప్పిన కథలే. మానవుని సుఖ దుఃఖాలకు ఆతని పూర్వజన్మ కర్మే అని చెప్పిన కథలే.

పెద్దనాది కవుల ప్రబంధాల కడకు వస్తే అవన్నీ రాజవంశాల గూర్చి, వారి యుద్ధ విజయాల గూర్చి, వారి శృంగార విలాసాల గూర్చి, ఇంకా స్వర్గ మత్స్యలోక వృత్తాంతాలాగూర్చి, అప్సరల నాట్య భంగిమల వర్ణించడానికి వారి కవితా శక్తినంతా ఉపయోగించారు. జన సామాన్యం వారి దృష్టిలోనే లేరు.

ఇక భక్తకవుల, శతక కవుల కవిత్వాలను చూద్దామా. వీరు ఆవేశంతో కవితలు చెప్పారు. అక్కడక్కడ మానవతారీతులు కనిపించినా ఆ ధోరణులన్నీ కేవలం దైవ భావానికి, జీవన్ముక్తికి సంబంధించినవై ఉంటాయి. కవిత్వం విషయంలో మాత్రం ప్రజలకు దగ్గరలో ఉంటారు. భావ విషయంలో వారు ఇహలోకానికంటే పరలోకానికి ప్రాధాన్యమిచ్చారు. సుమతి శతకం లాంటి కొన్ని నీత్యుపదేశ శతకాలలో మానవుని దైనందిన జీవితానికి ఉపయోగపడే నీతులు కనిపిస్తాయి. ఈ శతక పద్యాలు జన సామాన్యం వదనాలపై తాండవమాడుతుంటాయి.

ప్రాచీన కన్నడ సాహిత్య వీధులలో కూడా ఇదేధోరణి కనిపిస్తున్నది. పంపాదులు జైనులైనా భారతాది కథలను తమ మూసలో పోసుకొని నూతన దృక్పథంతో, కావ్య సృష్టి చేసినా, వైదిక వాసన పూర్తిగా వారిని వదల లేదు. వారి కావ్యాలలో కూడా సామాన్య మానవుని కష్టసుఖాలకు ఏమీ ప్రాధాన్యమివ్వలేదు.

పంపడు తను ఆశ్రయించిన అరికేసరి మహారాజును అర్జునునితో పోల్చి అతడ్ని తన భారతానికి నాయకుడిగా చేశాడు. పొన్న, రన్నలు కూడా ఇంచు మించుగా పంపని త్రోవలోనే పయనించారు. పాలక వర్గానికి, ఉన్నత వంశాలకు జెందిన వారు మాత్రం వీరి కావ్యాలలో కనిపిస్తారు.

12వ శతాబ్ది మధ్య కాలంలో వెలసిన వచన కావ్యాలలోనూ, పురంధరదాస కనకదాస వంటి దాసుల (దాసకూట) కీర్తనలలో పలుచోట్ల మానవతా రీతులు కనిపించినా అవి కేవలం దైవభావానికి చెందినవై ఉంటాయి.

## బసవేశ్వరుడు

కన్నడ సాహిత్య లోకంలో బసవేశ్వరుడు ఒక విప్లవజ్యోతి. అతని అనుయాయులు కొందరు జాతి, కుల భేదాలు లేని ఉత్తమ సమాజ నిర్మాణానికి గొప్ప కృషి చేశారు. వీరి కవితలలో సామాన్య మానవుడికి గొప్ప స్థానమేర్పడింది. దైవ సృష్టిలో మానవులంతా సమానమే అని, సంకుచిత దృష్టిగల స్వార్థ పరులు కొందరు ఈ విభేదాలను సృష్టించారనీ, ఈ విభేదాలను రూపుమాపవలెనని ఎలుగెత్తి చెప్పారు. వీరు అన్ని రంగాలలోనూ స్త్రీ, పురుష సమానత్వాన్ని బలపర్చాడు. అట్టడుగున గల జాతుల అభివృద్ధికి అవిరళ కృషి సల్పాడు. 12వ శతాబ్దములోనే ఈ మహాపురుషుడు కులాంతర వివాహాలను ప్రోత్సహించాడు. అంటరాని తనాన్ని రూపు మాపడానికి గొప్ప కృషి చేశాడు. ఈ విప్లవ వీరుడు స్థాపించిన మతం వీరశైవం. వీరశైవము ఆ రోజుల్లో బహుజాతుల మతమై విలసిల్లింది.

బసవేశ్వరునకు పుత్వం కన్నడ సమాజంలో వైదిక మత వర్ణ వ్యవస్థ వెర్రితలలు వేసి, జాతి, కుల విభేదాలను వర్ణ విద్వేషాలను రెచ్చకొట్టింది. అగ్రజాతి వారు నానా విధాలైన అరాచకాలను సృష్టిస్తుండే వారు. కన్నడ సమాజం అశాంతికి నిలయమై ఉండేది. మహానుభావుడైన బసవేశ్వరుడు ఆ దుష్ట వ్యవస్థను సమూలంగా నాశనం చేయడానికి తీవ్రకృషి చేశాడు.

వీరశైవ సాంఘిక విప్లవమెంత గొప్పదైనా దురదృష్టవశాత్తు కొత్త మత దురభిమానమొకటి ఏర్పడింది. ఆ దురభిమానం కూడా శ్రుతి మించిన రాగంలో పడింది. అంతా శివ మయమే అన్నారు. వీరశైవులు శివుణ్ణే తప్ప వేరొకర్ని దేవునిగా భావించి పూజించే మతాలనన్నిటినీ వారి ఖడ్గ దారతో ఎదుర్కొన్నారు. చూడండి వారి మత అహంకారం :

''జిన సమయస్థుల శిరములు దునిమి
ముని విష్ణు సమయుల ముక్కులు కోసి
అద్వైతులను హతహతము గావించి,
వి ద్వేష బౌద్ధుల విపత పమాది
చార్వాక వాదుల గర్వంబులణచి ॥

(పాల్కురికి సోమనాధుని బసవపురాణం)

గొప్ప ఆశయాలతో స్థాపింపబడిన బసవేశ్వరుని వీరశైవానికి ఈ మత దురహంకారం గొప్ప కళంకాన్ని తెచ్చిందని చెప్పక తప్పదు.

కన్నడ సాహిత్య లోకంలో బసవేశ్వరుని తర్వాత పేర్కొనదగిన మానవతా మూర్తి, ప్రజా కవి సర్వజ్ఞుడు. ఈ మహాపురుషుడు వీరశైవ భావచ్ఛాయలలో పెరిగినా ఆ మత దురహంకార మీతని కంట లేదు. ఈతని కవిత్వానికి కేంద్రం సామాన్య మానవుడు. తెలుగు సాహిత్యంలో మొదటి మానవతాకవియైన వేమన్నకీతడు అచ్చువు ప్రతిబింబం. అన్ని విధాలా అన్నదమ్ముల వారు.

## వేమన్న

తెలుగు సాహిత్య ప్రపంచంలో సాటిలేని మానవతా మూర్తి వేమన్న ప్రతివిషయాన్ని ప్రశ్నించి పాఠకలోకాన్ని ఆలోచనా తరంగాలలో ఓలలాడించు గొప్ప భావుకుడు. కారణ విమర్శనా గ్రేసరుడు. భారత దేశాన బౌద్ధ సాంఘిక విప్లవానంతరం ఆంధ్ర దేశంలో సామాన్య మానవుని సమస్యల్ని సహేతుక దృష్టితో పరిశీలించిన మహాపురుషుల్లో ఈతడు మొదటివాడు.

''అన్యులకును వచ్చు నాపద తనదిగా
నెన్ను వాడు భువిని నున్నవాడు
అన్ని ధర్మములకు మిన్న ధర్మంబంది
విశ్వ..........''

ఇతరులకు వచ్చు ఆపద తనదిగా భావించినవాడే ఈ లోకంలో ఉన్నవాడు. ఈ భావం లేనివాడు ఈ లోకంలో లేని వాని క్రిందే జమ. అని మానవుని హృదయానికి చురుక్కున తగిలినట్లు అతని బాధ్యతా యుత నైతిక జీవితాన్ని గూర్చి గట్టిగా చెప్పాడు. సమస్త మానవ ధర్మాలలో ఇదే గొప్ప ధర్మమన్నాడు.

'' ఈ లోకంలో కలుగుతున్న సుఖ దుఃఖాలకు మానవుని పూర్వజన్మ కర్మే కారణం ఎవరి కర్మ వారిది. వారి కర్మానికి మనమేమి చేయగలం. దైవ కృప ఎలాగుంటే అలా జరుగుతుంది. మనం నిమిత్తమాత్రులం. మానవ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావు. పరిష్కరిస్తామని చెప్పడం వట్టి కల్ల'' అని చెప్పే వేదాంతులు వేమన్న కాలంలో కోకొల్లలు. ఈ రోజుల్లో కూడా అటువంటి వేదాంత పుంగవులు మన సమాజంలో పెక్కుమంది కనిపిస్తుంటారు. ఈ వేదాంతులు ఇరుగు పొరుగు వారిండ్లలో దొంగలు పడినా కళ్లారాచూస్తూ అది వారి దురదృష్టమని ఉదాసీనంగా ఉంటారు. వేమన్న ఈ ధోరణికి పరమ శత్రువు. మానవుడు తన కష్ట సుఖాలకు తానే కర్త :

''వ్రాత కంటే హెచ్చు వరమీడు దైవంబు,
చేతకంటే హెచ్చు వ్రాత లేదు.
వ్రాత కజుడు కర్త చేత కలదా కర్త
విశ్వ...........''

మానవుడు తన సుఖదుఃఖాలకు తానే కర్త. బ్రహ్మదేవుడు వ్రాతకు మాత్రమే కర్త అతనిని ప్రార్థిస్తే ఎక్కువ ఇవ్వడానికి గానీ, ప్రార్థించకుండా ఉంటే మనకు రావల్సింది తగ్గించడానికి అతనికేమీ

హక్కు లేదు. అంతా మానవుని చేత మీదనే ఆధారపడి ఉంటుంది. వేమన్న మానవుడ్ని మహాశక్తి సంపన్నునిగా జేసెను.

ప్రఖ్యాత మానవతావాది Protagoras "Man is the mesure of all things" అన్న మాటలు ఇచ్చట జ్ఞప్తికి వస్తాయి.

వేమన్నపై పరిశోధన చేసిన Camp Bell మహాశయుడు చెప్పిన మాటలు కూడా ఈ సందర్భంలో "He recognises the distinction between the supreme spirit and the individual self and assigns to the human bill ablace and an importance which preuent him from considering men mere uppets in the hands of some superior power.

Camp Bell, "Vemana Through Western Eyes". - V. N. Narla - page 64

## శ్రమశక్తి

''భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్త్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు తానేను''

మానవుని మనుగడకు సంబంధించిన సమస్తమూ భూమిలోనే పుడతాయి. సర్వతత్వాలు అతని శరీరం నుంచే వస్తాయి. మానవుని శ్రమలోనే సర్వమూ ఉంది. శ్రమే సర్వస్వమని మానవుని శ్రమశక్తికి పట్టాభిషేకం చేశాడు వేమన్న.

## జీవుడే దేవుడు

''శివుడు గలడటంచు శిలలకు మ్రొక్కెడి
వెఱ్ఱి జీవులారా వెతలు విడుడి
జీవులందెకాక శిలలనేమున్నది?

జీవుడే దేవుడు. జీవులను తృప్తిపర్చండి. రాళ్ళను పూజించిన ప్రయోజనం లేదు. రాళ్లకు మ్రొక్కడం మీ వెర్రితనము. సారవిచారణ చేయండి.

''తోలు కడుపులోన దొడ్డ వాడుండగ
రాతి గుళ్ళలోన రాశిపోయ
రాళ్ళు దేవుడైన రాశులు మింగడా?

తోలు కడుపు లోనే దేవుడుండగా ఆతనిని దర్శించలేక మీచే నిర్మింపబడిన రాతి గుళ్లలో రాశులు పోస్తున్నారు. ఆ రాళ్లే దేవుడైనట్లయిన ఆ రాశుల్ని మ్రింగే ఉండేవాడుకదా? మనసార విచారణ చేయండి.

## జీవకారుణ్యం

''రాతి బసవనిగని రంగుగా మ్రొక్కుచు
గునుకు బసవనిగని గుద్దుచుంద్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ''
బసవడు (ఎద్దు) శివుని వాహనమని

బసవడు శివుని వాహనమనీ, దైవ సంబంధమైన ఎద్దనీ, ఆ ఎద్దును పూజిస్తే శివుని అనుగ్రహాన్ని సులభంగా పొందొచ్చని మూర్ఖ శిఖామణుల నమ్మకం. కారుణ్యమూర్తి అయిన వేమన్న కూడా చెబుతున్న ప్రత్యక్ష బసవని గుద్దుచు, హింసిస్తూ చలనము లేని రాతి బసవనికి మాత్రం రంగుగా ప్రార్థనలు చేస్తుంటారు. విచక్షణా జ్ఞానము లేని వారి భక్తి ఎందుకు? నిజంగా ఆ బసవ భక్తులంతా పాపులని చెప్పాలి. జీవకారుణ్యం లేని మూర్ఖజనులు.

గౌతమ బుద్ధుడు పరిపూర్ణ శాంతిని పొందడానికి తన శిష్యలోకానికి ఐదు విధాలైన సమాధులు ఉపదేశించాడు అందులో మొదట మైత్రీ సమాధిని గూర్చి ఇలా చెప్పాడు :

''ఓ శ్రమణులారా! సమస్త ప్రాణుల సుఖాలను చివరకు మీ శత్రువుల సుఖం కూడా అభిలషించే విధంగా ఈ సమాధిలో మీ హృదయాల్ని సంస్కరించుకోండి. అదేమీకు మనశ్శాంతిని కల్పిస్తుంది. అదే మీకు నిర్వాణ మార్గం అన్నాడు.

## వేమనపై బుద్ధుని ప్రభావ మున్నదా?

''చంపదగినయట్టి శత్రువు తనచేత
జిక్కనేని కీడు చేయరాదు.
పొసగ మేలుచేసి పొమ్మనుటే చాలు''

చంపదగిన శత్రువును చంపేమనుకోండి అది ఒక నేరానికి ఇంకొక నేరం జోడించినట్లవుతుంది. అలాకాకుండా ఆ శత్రువుని క్షమించడమే మంచిది. ఇది లౌకిక నీతి. పరమార్థ నీతి దయాళుత్వం **(compassion)** ఇదే నిజమైన మానవత్వం.

''క్షమియించు వారి గని చాలమి బెట్టుదురు
రైనన్ దలంప ననూన క్షమయు కడుమెరయుంతోడ
వుత్తమ రూపము గోరు వారు దాల్తురు దీనిన్''

(తిక్కన మహాభారతం, ఉద్యోగ పర్వం ద్వితీయ శ్వాసం)

## సర్వజ్ఞుడు

కన్నడ సాహిత్య ప్రపంచంలో సర్వజ్ఞకవి వేమన్నవలె ప్రతి విషయాన్ని ప్రశ్నించాడు.

మానవులందరూ సమానమే. వ్యత్యాసాలు స్వార్థపరులు, వివేక శూన్యులు కల్పించినవే. దురదృష్టవశాత్తు ఇంకా అవి చెక్కుచెదరకుండా నిల్చి ఉన్నాయి. వాటిని పగుల గొట్టక పోతే నీతి, మానవత జీవింపజాలదన్నాడు. అతడు ఇలా అన్నాడు :

''నడవు దొందె భూమి కుదివు దొందె నీరు
సుడువగ్ని యొందె ఇరుతిరలు
కులగోత్ర నడువె యత్తణదు సర్వజ్ఞ''

''అవయవగళెల్లరిగె సమవాగి యిరుతిరలు
భవి, భక్త శ్వపచ, శూద్ర వివరింతెంబ
కవన వెత్తణదు సర్వజ్ఞ''

ఒక భూమిపై నడిచి, ఒక నీటినే త్రాగి, ఒక అగ్నిలోనే కాలిపోతుండగా ఇంకా కులగోత్ర వ్యత్యాసాలేమున్నవి?

మానవులందరికీ అవయవాలన్నీ సమానంగా ఉండ, అతడు భవి, ఇతడు భక్తుడు, అతడు స్వపచుడు, ఇతడు శూద్రుడు అనే భేదమెక్కడ నుండి వచ్చింది? బాగా ఆలోచించండి. మానవ సమాజ మొకటే, ఏ విధమైన వ్యత్యాసాలు లేవన్నా పన్నాడు సర్వజ్ఞుడు.

సర్వజ్ఞుడు వీరశైవ మతచ్ఛాయల్లో పెరగడం మూలాన అతని భాషలో తత్త్వం, పరతత్త్వం అన్న మాటలు ఎక్కువగా దొర్లుతుంటాయి. వేమన వలెనే ఈతడు కూడా రాళ్లను, రప్పలను పూజించటం వల్ల ప్రయోజనం లేదు. ''కారుణీక పురుషుడు మీలో ఉండగా మందిరానికి వెళ్లడమెందుకయ్యా అన్నాడు. దేహమే దేవాలయం జీవుడే దేవుడు. జీవ దయాళులై, సచ్ఛీలురై, జ్ఞాన భక్తి తత్పరులై జీవితాలను నడపండి. అదే నిజమైన మోక్షసాధనం అన్నాడు.

ధనవంతులు ధర్మబుద్ధిగల వారై పేద ప్రజానీకానికి సహాయ పడాలని బోధించాడు.

'' ఈ వంగె దేవంగె ఆవుదంతరవయ్య''

దాతకు దైవానికి వ్యత్యాసమే లేదన్నాడు. లేని వారికి దానం చేయమన్నాడు. ఆకలన్న వారికి అన్నం పెట్టడమే శివుని పూజించుట. అన్న దానమునకు మించిన దానమిలలో లేదు.

''అన్న దేవర ముందె ఇన్నుదేవర ఉంటె''-

వేమన్న వలెనే సర్వజ్ఞుడు కూడా ఏకేశ్వరోపాసకుడు.

''ఒబ్బ నల్లదే జగకె ఇబ్బరుంటెమత్తె?
ఒబ్బ సర్వజ్ఞ కర్తరు జగకెల్ల
ఒబ్బనే దేవ సర్వజ్ఞ''

## వేమన్న

''పసుల వన్నె వేఱు పాలేక వర్ణమే
పుష్ప జాతి వేఱు పూజ యొకటె
దర్శనములు వేఱు దైవంబదొక్కటి

ఈ విధంగా ఈ మహాపురుషులిద్దరూ మానవ కల్యాణానికి తమ మానవతావాద కుసుమాలను తోరణాలు కట్టారు.

# 'నూతి'లో గొంతుకల 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం!

(గత సంచిక తరువాయి)

**- నరేష్ నున్నా**

'మహాప్రస్థానం' లో 'పదండి ముందుకు పదండి తోసుకు...' మార్క్ ప్రగతి శీలక పాటలే కాదు... 'నడిరాతిరి కడలి వద్ద / హోరుగాలి ఉపశ్రుతిగ / నీలోనే నీవేదో / ఆలపించుతావ్? / అవ్యక్తపు టూహలతో / ఆలపించుతావ్? / జగమంతా నిదుర మునిగె / సద్దణిగిన నడిరాతిరి / నీలోనే నీవేదో / ఆలకించుతావ్...' అంటూ సాగే ఆత్మ నివేదనాత్మక కవితలు కూడా ఉన్నాయి. 'కేక', 'అవతలి గట్టు', 'పరాజితులు', 'నీడలు', 'నిజంగానే' వంటి కవితలలో ఆధునికతా సాహితీ లక్షణాలైన న్యూనతా భావం, సందిగ్ధత, అంతర్ముఖత్వం, ఆత్మ నివేదన అన్నింటికన్నా ముఖ్యంగా శ్రీశ్రీలో తక్కువగా ఉన్నదని అనిపించే సాధారణ గ్రామ్య భాషా ప్రయోగం.... వంటివి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కానీ వీటన్నింటి కంటే ఉపరితలంలో కనిపించే ఛందో వైముఖ్య లక్షణాన్ని ఎత్తి చూపుతూ, కవికి నాయకత్వాన్ని మార్గదర్శకత్వాన్ని ఆపాదించే ప్రయత్నాలు జరిగి తనకు అగ్రస్థానం లభించడంతో తెలిసిన ఎన్నో విషయాలను కూడా కన్వీనియెంట్‌గానే ఆయన (శ్రీశ్రీ) దాటవేశారు. అంటే కవిత్వం కంటే ఐడియాలజీ తాపడం చేసిన కవిత్వమే తనను (తన) గమ్యానికి చేరుస్తుందని ఆంధ్రదేశంలో కవులు గ్రహించారనడానికి ఆదికవే స్పష్టమైన ఉదాహరణ. ఈ 'అడ్డదారుల' వెదుకులాట పరమార్థం; 'ఆ దారులు' దారితీసే గమ్యం - 'తాను', 'తన కవిత్వమూ' అయ్యాయి ఆధునిక తెలుగు కవులకి. అందుచేత ఆంధ్రదేశంలో ఆధునిక కవుల చరిత్ర అంతా కీర్తిదాయక మార్గం వెంట (బహుశా ఆత్మహననాత్మక) ప్రయాణమే. పునరుక్తి అనుకోకపోతే కవిత్వం - సత్యం నుంచి మరింత లోతైన సత్యం దిశగా ప్రయాణమని కాక అది ఒక అడ్డదారి మాత్రమేనని శ్రీశ్రీ వంటి ఆద్యులు భావించారనడానికి ఒక చిన్న ఉదాహరణ:

శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలంగారి యోగ్యతా పత్రంలో ఇలా ఉంటుంది - 'శ్రీశ్రీ కవిత్వమూ, పాల్‌రోబ్సన్‌సంగీతమూ ఒకటే అంటుంది సౌరిస్'. కానీ చలంగారు రాసిందిలా - 'శ్రీశ్రీ కవిత్వమూ, కె.సి.డే సంగీతమూ ఒకటే అంటుంది సౌరిస్'. యోగ్యతా పత్రంలో కె.సి. డేను పాల్ రోబ్సన్‌తో స్థానభ్రంశం చేసింది స్వయంగా శ్రీశ్రీయే. కృష్ణచంద్రడే (సోకాల్డ్) ప్రగతిశీల గాయకుడు కాకపోవడం కాదు అసలు కారణం; 'పశ్చిమ' సంబంధిత శబ్దాల మీద మోజు ఉండడమే నిజమైన కారణం. 'తెలుగు స్విన్ బర్న్' అనో, 'ఆంధ్రా డిలాన్ థామస్' అనో, 'అభినవ గిన్స్‌బర్గ్' అనో అంటే తప్ప తెలుగు నేల మీద మేధావులకు రుచించదని తెలిసిందే కదా! ఆ సగటు లౌక్యాలు కూడా వదులుకోలేక పోవడమే కాదు, తద్వారా మహా సాహితీ నేరానికి పాల్పడడానికి కూడా వెనకాడని కవి ఒక జాతికి ఆద్యుడు కావడం ఒక దుర్భర విషాద సందర్భం.

కనుక పాశ్చాత్య కవిత్వానికి, మన కవిత్వానికి ప్రారంభం ఒకటే - రెండూ విషాద సందర్భాలే (అయితే భిన్నత్వం / వైరుధ్యం Spirit కి సంబంధించినదే).

కనుక అటువంటి శ్రీశ్రీ ఆదికవిగా ప్రారంభమయిన ఆధునిక కవితా చేతన రెండు భాగాలుగా చీలిపోయిందని నా అభిప్రాయం. శ్రీశ్రీ వారసత్వ విభాగం, శ్రీశ్రీ ప్రభావేతర విభాగం. నిబద్ధత, అనిబద్ధత అనే రెండు నేలబారు మాటలతో కూడా ఈ రెండింటినీ విభజించి చూసుకోవచ్చు.

శ్రీశ్రీ 'స్ఫూర్తి' ఆదర్శంగా, శ్రీశ్రీ కవిత్వమే 'గమ్యం'గా ప్రయాణం ప్రారంభించింది నిబద్ధ కవిలోకం. ప్రపంచవ్యాప్తంగానే మంచి సాహిత్యకారుల్ని కొద్ది సంఖ్యతోనైనా మార్క్సిజం అందించగలిగిందేమోగానీ, 'కమ్యూనిజం' అందించిన సాహిత్యకారులు దాదాపు లేరు. సామ్రాజ్య వాద దేశాలు బైటనుంచి పొంచి, రంధ్రాన్వేషణకి పూనుకున్నప్పుడు, ఏ చిన్న లొసుగు బైటపడినా 'శత్రువు'కు కొత్త ఆయుధాన్ని అందించినట్టవుతుందన్న భయంతో, గుట్టును దాచి ఉంచే ప్రయత్నంలో కమ్యూనిస్టు దేశాలు అనివార్యంగా దాపరికాన్ని నేర్చుకున్నాయి. మునుపు గోరంతే ఉన్న లొసుగులు తర్వాత తర్వాత కొండంత పరిమాణానికి పెరిగినప్పుడు బుకాయింపు ఎక్కువై, ఏ అబద్ధాలనయితే ప్రచారం చేయాలని చూశారో ఆ అబద్ధాల్ని వాళ్ళే నమ్మే ఘోరమైన స్థితికి చేరుకున్నారు కమ్యూనిస్టులు. దాని ఫలితంగానే 'నిజాయితీ లేమి', 'సత్య విముఖత' కమ్యూనిస్టుల కనీస అర్హతలుగా మారాయి. అందువల్లనే కమ్యూనిస్టులలో సాహిత్యకారులు లేకుండా పోయారు. మరీ ముఖ్యంగా ఆంధ్రదేశంలో ప్రతిభరీత్యా మహా మేరు పర్వతమైన శ్రీశ్రీ తర్వాత ఎండిన అడుసు దిబ్బగా మారడానికి కమ్యూనిజమే కారణం. నిజాయితీ లోపించిన కవిత్వం మృత కవిత్వమే కనుక శ్రీశ్రీ విభాగానికి చెందిన అరసం, విరసం - రచయితలు తెలుగు కవిత్వానికి చేసిన కాంట్రిబ్యూషన్ ఏమీ లేకుండా పోయింది. ఇంతకు ముందు పేర్కొన్నట్టు ప్రజలతో సంబంధం లేని ప్రజాయుద్ధాలు చేసే అడ్డదార్లను ప్రతిఘటన యోధులు ఎంచుకోగా, వారి ప్రతి చర్య / కదలికనూ కీర్తించడమే ఏకైక ఎజెండా చేసుకొని మరింత దొడ్డిదారిని కని పెట్టేశారు విప్లవ కాముక రచయితలు.

ఇంకా నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే తమరాతల్ని చెలామణీ చేసుకోవడానికి మాత్రమే అరసం, విరసం శిబిరాలు ఉపయోగపడ్డాయి. ఆరుద్ర, వరవరరావు, శివసాగర్ లాంటి వాళ్ళు వారి వారి సంఘాలలో భారీ ఎత్తున ఎలివేట్ కావడాన్ని 'ఆముదపు చెట్లు మహా వృక్షాలు'గా పేరొందడంతో సరిపోల్చుకోవచ్చు ( విప్లవ కవిత్వానికి **romantisist diction** ని అందించిన సౌదా గతంలో విరసం సభ్యుడైనా ఆయన మీద 'ప్రజా కవుల' ప్రభావం లేదు).

శ్రీశ్రీ కులస్థులలో ఒక్క శివారెడ్డి తప్ప చెప్పుకోతగ్గ కవిలేడు. అయితే దురదృష్టవశాత్తూ తాను 'మంచి కవి' నని ఉండవలసిన దానికంటే ఎక్కువ స్పృహ శివారెడ్డికి ఉంది. ఈ ఎరుకే ఆయనను విరసం 'గుంపులో గోవిందం' కాకుండా చేసింది ( తాను ఆముదపు చెట్టుకన్నా ఎక్కువేనని కూడా ఆయనకు తెలుసు). అయితే మొదట్నుంచీ ఆయన కవిత్వం ద్వారా శత్రువుల మెప్పు కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. ఆయన కవిత్వం శిల్ప విశేషాన్ని బట్టి ఆయన వర్గీయులైన కొందరు కరడుగట్టిన 'ప్రజా కళారాధకులు' - ప్రజా కవిత్వమనే మహా కఠినమైన పదబంధంతో బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నించినా లొంగక పోవడమే శివారెడ్డి విజయ రహస్యం. ఇటువంటి ప్రగతి కాముకులకు దళిత, స్త్రీ, మైనారిటీవాదుల వంటి కొత్త కొత్త విభాగాల నుంచి కొంగొత్త **threats** దూసుకొచ్చాయి. ఆయా వాదాలకు అనుకూలంగా సంఘీభావ కవిత్వం - రాయకపోతే ప్రగతశీలిని కాదంటారేమో అన్న భయాల్ని, బ్లాక్ మెయిలింగ్‌ని జయించి ప్రచురించిన 'నా కలల నది అంచున' ఒక్కటే ఆయన రక్తమాంసాలున్న కవిత్వంగా మిగిలిపోవచ్చు.

అరసం, విరసాల మధ్య, అంటే '65-68' మధ్య మూడేళ్ళ ముచ్చటగా మిగిలిన దిగంబర కవిత్వం గురించి కూడా కొంత ప్రస్తావించుకోవలసి ఉంది. నగ్నముని సారథిగా సాగిన దిగంబర కవిత్వోద్యమానికి అలెన్ గిన్స్‌బర్గ్ - బీట్ ఉద్యమమే స్ఫూర్తి. తమకు ఏ మేరకు లాభదాయకమో ఆ మేరకు మాత్రమే ఏ భావాన్నైనా దిగుమతి చేసుకునే లక్షణం మనకు సహజాతిసహజమని ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఆర్థిక మాంద్యం వల్ల అమెరికాలో ఏర్పడిన అభద్రత, సంక్షోభస్థితి కారణంగా అమెరికన్ Psyche తోనే ఒక పతనం ప్రారంభమయింది. తమ భద్రత కోసం కొత్త సామాజిక నిర్మాణాన్ని, తన జీవితాల్లోకి రాజ్యం చొరబాటునే వారు ఆహ్వానించారు. ఈ సంక్షోభ దశలోనే సమష్టితత్త్వంలోని 'సహకార ప్రయత్నం' - 'సామర్య జీవనం' వంటి పాజిటివ్ అంశాల దిశగా కాక జాతీయ వాదమనే మహమ్మారి దిశగా నడిచింది అమెరికా. ఫలితంగా 'వ్యక్తి' మరణించి అర్థరహితమైన హింస, పరాయీకరణ, ఆధునీకరణ వంటి జాడ్యాలు సోకిన 'కొత్త వ్యక్తి' పుట్టాడు అక్కడ. ఈ పరిస్థితుల మీద తిరుగుబాటుగా వచ్చిందే బీట్ ఉద్యమం. బీట్ ఉద్యమ స్ఫూర్తితో తలెత్తిన దిగంబర కవిత్వ ఉద్యమానికి కూడా ప్రేరణగా అక్కడి సామాజిక పరిస్థితులే ఉండనవసరంలేదు. నాటి మన భారత / ఆంధ్ర దేశంలోని మన రాజకీయ 'సామాజిక వాతావరణం కూడా ప్రేరణ కావచ్చు. అయితే అటువంటి ప్రేరణే ఉన్నట్లయితే, కొత్త మార్పుకు మార్గాన్ని సుగమం చేయడమే యాంటీ పొయిట్స్ తక్షణ లక్ష్యమని వారు అర్థం చేసుకుని ఉన్నట్లయితే ఆ ఉద్యమం అలా మూణ్ణాళ్ళ ముచ్చట అయ్యేది కాదు. సమాజానికి 'షాక్' ఇవ్వడమనే తొలి లక్ష్యాన్ని విజయవంతంగా నెరవేర్చినా, ఆ 'దిగ్భ్రాంతిని' తమ ప్రచారానికి ఒక ప్రధాన సాధనంగా దుర్వినియోగం చేశారు. బిచ్చగత్తె చేత, రిక్షా కార్మికుని చేత తమ సంకలనాలను అర్థరాత్రి ఆవిష్కరింప జేయడం వంటి క్రియలకై పరిమితమైన వారి ప్రయత్నం వారిది ఒక బులపాటమేనని నిరూపించింది. దిగంబర కవిత్వోద్యమం పేరిట వారు చేసిందంతా ఆగ్రహాభినయమేనని తర్వాత తరాలు అర్థం చేసుకునేలా చేశారు. అప్పటికి ఆంధ్రదేశంలో అలుముకున్న అభ్యుదయ కవితావరణపు మొనాటనీని భరించలేక బహుశా అప్పటి సాహితీలోకం దిగంబర కవిత్వాన్ని ఆహ్వానించి ఉండవచ్చు. గాడి తప్పిమని అంతా ఆరంభశూరత్వంగా మిగిలిందని దిగులుపడిన మహాస్వప్న, భైరవయ్య వంటి వారు చీకట్లోకి తప్పుకోగా మిగిలినవారు విరసం కవులుగా రంగులు మార్చుకున్నారు. 'ఆకవిత్వం' అవసరాన్ని రారావంటి వారు గ్రహించలేదు. అందుకే దిగంబరులపై దాడి చేశారు. అయితే ఆ దిగంబరులు విప్లవ కవులుగా మారి ఆ 'ఆకవిత్వపు' ఆవశ్యకతపై తమకు కూడా అవగాహనలేదని నిరూపించడం ఒక చిన్న కొసమెరుపు. 'అకవిత్వ' మనే లేబుల్ లేకుండానే దిగంబరులకు రెండున్నర దశాబ్దాల ముందు పఠాభి ప్రకటించిన 'ఫిడేల్ రాగాలు డజన్' చాలా వరకూ 'అకవిత్వ' లక్ష్యాన్ని నెరవేర్చిందని చెప్పుకోవచ్చు.

కాలానికి విశ్రాంతనివ్వని కవులు, అవిశ్రాంతంగా సాహిత్యోద్యమాల వికాసానికి కృషి చేసిన కవినాయకుల గురించి కొంత చెప్పకోవాలి. తన కవిత్వం ప్రచురించక పోయినా, తన సంకలనం సమీక్షించపోయినా సమకాలీన సాహిత్యావరణంలోని కాలుష్యం, విలువల క్షీణత చప్పున స్ఫురణకొచ్చాయి / కొస్తాయి చాలా మంది 'నేను' కేంద్రక కవులకు. దాంతో సారూప్య వేదనని

అనుభవిస్తున్న సహ కవులను కూడగట్టుకొని ఆ కాలుష్య నివారణకు, విలువల ఉద్ధరణకు సాహిత్యానికే అంకితమయ్యేలా ఒక కవిత్వ పత్రికను (మూణ్ణాళ్ళ ముచ్చటగా) స్థాపించడం ఆధునిక ఆంధ్రదేశంలో ఒక పురాతన ఆనవాయితీ. 'నేను' కేంద్రకత్వ తీవ్రతను బట్టి అది ఒక కవిత్వోద్యమ స్థాపనకు కూడా దారితీసిన సందర్భాలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి మన సమీప గతంలో. ఆదర్శాల మేనిఫెస్టోతో సామూహిక చేతనని ఆవాహన చేస్తూ పుట్టగొడుగుల్లా లేచిన ఉద్యమాలలో కొన్ని చేతనావర్త, అనుభూతి వాద, హైగంబర, కవిసేన.... తదితర ఉద్యమాలు కొన్ని. ఈ స్వయం సేవక ఉద్యమాలలో బాగా పేరు పొందిన ఉద్యమం - కవిసేన ఉద్యమమే. దానికి సారథి 'విప్లవభాషా విధాత'గా పేరుపొందిన పండిత కవి గుంటూరు శేషేంద్ర శర్మ. కవిసేన ఆవిర్భావానికి మూలాలను అర్థం చేసుకోవడమంటే - 'కవులుగా పేరొందడం' పట్ల కవి కూటములకు ఉన్న యావ, ఫలితంగా ఒక గుంపు అంటే మరో గుంపునకు ఉండే దుగ్ధలను అర్థం చేసుకోవడమే.

శేషేంద్ర 1958 నాటికే కవి. అయితే పద్య కవి. చిన్ననాటి నుంచి మార్క్సిజంతో గాఢ పరిచయం ఉందని చెప్పుకునే శేషేంద్ర కవితారూపంలో వచ్చిన విప్లవాన్ని 1972 వరకూ గుర్తించకపోవడం, తనలో ప్రజ్వలించే (?) విప్లవ భావజాలానికి 1974 (మండేసూర్యుడు) వరకూ అక్షర రూపం ఇవ్వాలని అనిపించకపోవడం గొప్ప వైరుధ్యాలు. నిజానికి వైరుధ్యాలు కావు. ఆదశలో ఆయన కవిత్వం రాయలేదు. కవిత్వం ఎలా ఉండాలో నిరూపించాలనుకున్నారు. ప్రభోదించాలనుకున్నారు. 1970 - 74 ప్రాంతాలలో కవిత్వాన్ని నిరసనతోనే గమనించిన శేషేంద్ర, నాడు విప్లవకవులుగా ఎనలేని కీర్తిని 'ఆయాచితం'గా పొందిన వారి పట్ల దుగ్ధతో మాత్రమే ఆధునిక కవితారంగ ప్రవేశంచేశారు. ఈ ప్రభోదక ప్రయత్నంలో విప్లవభావాన్ని నిర్వచించుకోలేదు సరికదా, ప్రచారంలో ఉన్న విప్లవభావాన్ని అభివ్యక్తించేందుకు తన మూలాల్లోని వైదిక భాషను ఉపయోగించి, విప్లవభావజాలానికి కావ్యాభివ్యక్తినందించిన భ్రమకు లోనయ్యారాయన, ఆయన అనుయాయ విమర్శకులు. ఆయన సేనానాయకుడిగా తయారుచేసిన కవిసేన కవులు భావాన్ని అటక ఎక్కించేసి పదాల కూర్పు పైన, భాషాడంబరతపైన ఎక్కువ మోజు కనబరిచి కవితాత్మనే భంగపరిచారు.

ఇక శ్రీశ్రీ ప్రభావేతర విభాగం కింద ఆధునికత లక్షణాలైన అంతర్ముఖత్వం, ఆత్మ పరిశోధన, కన్ఫెషన్, ఇన్హిబిషన్స్ గొలుసుల్ని ఛేదించుకోవడం, సంశయం, సందిగ్ధత, లైంగిక నిష్కాపట్యాలను తెలుగు కవిత్వానికి అందించిన కవులలో బైరాగి, అజంతా, ఇస్మాయిల్, 'మో' వస్తారు. ఈ అనిబద్ధ కవులంతా **non-marxists** కావడం యాదృచ్ఛికమేమీకాదని ముందే అన్నాను. అయితే ఈ కవులు కొందరి వల్ల తెలుగు కవిత్వానికి, మరీ ముఖ్యంగా '80ల తర్వాత తెలుగు కవిత్వానికి జరిగిన కీడే ఎక్కువని నా అభిప్రాయం.

సత్యాసత్యాల అన్వేషణలో, పాపపుణ్యాల తర్జనలో అత్యున్నత తాత్వికస్థాయిని అందుకున్న కవిత్వాన్ని రాసినవాడు బైరాగి. భావ కాఠిన్యంతోపాటు, భాషా కాఠిన్యం కూడా బైరాగి కవిత్వంలో ఉన్నాయి. ఈ రెండింటి వల్ల అనుసరణకు, అనుకరణకూ సాధ్యం కానందువల్ల బైరాగి వల్ల జరిగిన కీడేమీ లేదు. కానీ, ఏవిధంగానూ 'ఉపయోగపడ'ని కారణంగా ఆయన అనామకంగానే మిగిలిపోవాల్సి వచ్చింది.

ఇస్మాయిల్ ఒక విశిష్టమైన / విచిత్రమైన పరిణామం. 'చెట్టు నా ఆదర్శము' ని చెప్పుకున్న ఇస్మాయిల్ మొదట కమ్యూనిస్టు పార్టీలో ఉన్నవారే. తాను ఎంచుకున్న మార్గం అసమగ్రమనీ, లోపభూయిష్టమని అర్థం చేసుకొని, ఆ మార్గం నుంచి బయట పడేందుకు, నిజమైన 'కవిత్వ' సాక్షాత్కారానికై 1944 నుంచి 60 వరకూ తపస్సు వంటిదే చేశారాయన. తెలుగు నేలకు బొత్తిగా ప్రవాసమైన అనుభవమే ఇది. సకల జీవన వైరుధ్యాలనీ, సంక్లిష్టతలనూ, వైషమ్య భరిత వాతావరణాన్ని గరళంలా కంఠంలో ధరించి, జీవితంలోని ఆనందపార్శ్వాన్ని మాత్రమే వ్యక్తం చేసే Saint poet ఆయన.

1930లో ఆర్థిక మాంద్యం ఏర్పడటం, శ్రీశ్రీ తండ్రి ఆస్తిని జూదంలో పోగొట్టుకోవడం జరగకపోతే - 'ప్రభవ' వంటి పద్యకావ్యాలో, ప్రేయసి కంటే ప్రియమైన భావ కవితలో అల్లుకుంటూ, 'పతితలు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు' వైపు కన్నెత్తైనా చూడకుండా, ఐ.సి.ఎస్. చదువుకై శ్రీశ్రీ లండన్ ఎగిరిపోయేవాడేమో; నిరుద్యోగం, అది అందించిన 'ఆకలి' ఎరగక పోయినట్టయితే 'బాధే తన ముఖచిత్ర' మన్న అజంతా 'చెట్లు కూలుతున్న దృశ్యా'న్ని చూడగలిగే వాడు కాదేమో.... అంటూ తర్కించడం సమంజసం కాకపోవచ్చు. ఫ్రెంచి విమర్శకుడు రోలాండ్ బార్త్ from work to text విమర్శకుని దృష్టి ప్రయాణం చేయాలని ప్రతిపాదించాడు. అయితే, కవిత్వానికి మూలంగా ఉన్న కవి సీమాసమయ సందర్భాలు కూడా సాహిత్య చరిత్ర విద్యార్థికి ఎంతో అవసరమవుతాయి. ఈ కోణంలో గమనిస్తే అజంతా ఒక అతి సామాన్యుడు. ఒక భయపడిన వాడు. పిడుగులు రాలుతున్నప్పుడు భయ విహ్వలతతో 'అర్జునా', 'ఫల్గుణా' అని ఉచ్చరించిన పలుకులవంటివే అజంతా కవితలన్నీ. నిర్జన ప్రాంతంలోంచి ఒంటరిగా నడిచొచ్చిన వ్యక్తి, భయనివృత్తికై ఎదురుపడిన మనుషులకి చేసే report ఆయన కవిత్వం. ఆయనను సర్రియలిస్టుగానో, ప్రపంచ యుద్ధాల బీభత్సాన్ని, ఆ బీభత్సంలో మృత్యు విశ్వరూపాన్ని దర్శించిన కవిగానో గుర్తించడం తప్పు. బహుశా ప్రపంచ యుద్ధాల సెగలో వెయ్యోవంతు ప్రసరించగా ప్రభావితమైన సామాజిక పరిస్థితుల నుంచి పుట్టిన కవిగా ఆయనను గుర్తించాలేమో.

అలాగే, సందర్భాన్ని బట్టి వేగుంట మోహన్ ప్రసాద్ (మో) ని గమనిస్తే, ఆయన తన తొలి సంకలనం 'చితి - చింత' ప్రకటించే నాటికి, అంటే 1969 నాటికి ఆంధ్ర సాహిత్య లోకం 'మరో ప్రపంచం' మత్తులో మునిగి ఉంది. అభ్యుదయ కాముకులు ముదిరి ప్రగతిశీలురుగా, పూర్తిస్థాయి విప్లవ రచయితలుగా మారే కొత్త transition దశలో ఉంది. పద్య కవిత్వం కంటే వచనకవిత్వం రాయడం సులభతరమని (అందుకే ఆ shift జరిగిందని) పైకి సనాతన వాదులు, లోలోపల ఆధునికులు కూడా అనుకునేవారు. పత్రికలందించే వార్తలనే ప్రాసతో అలంకరించి వచన కవిత్వ మహాకథనాలుగా ఆధునికులకు అందించిన కుందుర్తి పైవాదనకు ఇతోధికంగా బలం చేకూర్చి పెట్టారు కూడా. కానీ, పూర్వ నిర్దేశిత మార్గంలేని వచన కవిత్వం రాయాలంటే, 'శ్మశానాల వంటి నిఘంటువులను దాటి / వ్యాకరణాల సంకెళ్లు విడిచి / చందస్సుల సర్ప పరిష్వంగం వదలి'.... తనదంటూ కొత్త డిక్షన్‌ను తయారు చేసుకోవాల్సిన బాధ్యతల పెనుభారాన్ని ఏ వచన కవైనా మోయవలసి ఉంటుందని సాహిత్య లోకానికి తన కవిత్వం ద్వారా గుర్తు చేసిన / నిరూపించిన వాడు 'మో'. బాధ్యతల గురించిన ఊసు

'షాక్‌కట్లు' తెలుగు సాహిత్య ప్రపంచానికి ఆగ్రహాన్ని కలిగించకమానదు. 'తిరుగుబాటు', 'పురోగతి'... ఇత్యాదుల పట్ల చాలా కచ్చితమైన నమ్మకాలు, అభిప్రాయాలు ఉన్న నాటి సాహిత్య ప్రపంచం 'మో'ను తిరస్కరించడం ద్వారా తన ప్రగతిశీలతను చాటుకుంది. '80ల మధ్య ప్రాంతం వరకూ అంటే సుమారు 15, 16 సంవత్సరాలు ఆయన notorious కవిగానే గుర్తింపు పొందడం, ఆ తర్వాత (ఈ) తరం కవులకు (అర్థం కాకపోయినప్పటికీ) మార్గదర్శకుడవడం అతి ముఖ్యమైన, గమనార్హమైన పరిణామాలు.

'80ల తర్వాత వచ్చిన కవి ధోరణులు, కవుల మీద పై ఇద్దరి శైలీ ప్రభావమే విశేషంగా ఉంది. ప్రభావం అనేకంటే అనుకరణ అనడం సమంజసం. పైన చెప్పుకున్నట్టు బైరాగి భావకాఠిన్యమూ, ఇస్మాయిల్ సారళ్యమూ రెండూ అనుసరణకూ, అనుకరణకూ క్లిష్టమైనవే. చూడగానే కళ్ళు మిరిమిట్లు గొలిపే వాక్య శకలాల్ని పేర్చడమనే 'చిత్కాళ'ను '80ల తర్వాత తరం అజంతా, 'మో'ల నుండే గ్రహించింది. తెలుగు సాహిత్యరంగం కవిత్వానికే పునరంకితమైపోవడానికి ఈ ఇద్దరుకవుల బాధ్యత ఎంతైనా ఉంది. కవిత్వాన్ని మరింత 'ఆకర్షణీయం'గా చేయడం వారు తెలియక చేసిన నేరం. అతి తక్కువ మందిని మినహాయిస్తే, మిగిలిననేటితరం కవులకందరికీ కులవృత్తి వారసత్వంగా, అలవాటుగా అబ్బినట్లు కవిత్వం రాయడం అబ్బింది. ప్రతిభా వ్యుత్పత్తులు ఉండాలన్నది ప్రీమోడ్రన్ ఆలోచనైతే, 'ప్రతిభ' కన్నా 'నిజాయితీ' ప్రధానమని చెప్పింది ఆధునికత. కానీ దురదృష్టవశాత్తూ అది 'నైపుణ్యం' స్థాయికి దిగజారిపోయింది వర్తమానంలో.

'అధ్యయనం' అనే బడాయి మాటకు బదులు, మన context కు తగ్గట్టుగా 'చదవడం' అనే పదాలతో మాట్లాడుకుంటే, నిజానికి ఆ పుస్తకాలు చదవడమనేది కూడా ఒక short cut పద్ధతే. ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరించే తెగువ లేక, చేరువైన ప్రపంచాన్ని తేరిపార చూడగలిగే సామర్థ్యం లేక ప్రపంచపు మినియేచర్ రూపాన్ని 'పుస్తకం' ద్వారానైనా చూసి అర్థం చేసుకోవాలని భావించడంలో అడ్డదారిని వెదుక్కునే ప్రయత్నమే ఉంది. జీవితం సంక్లిష్టమవుతున్న కొద్దీ, వాతావరణం సంక్షోభమవుతున్న కొద్దీ ప్రపంచపు 'అర్థాంగానితనం' అనంతంగా పెరిగిపోతుంటే, జ్ఞానానికో, అజ్ఞానానికో చదువుకోవడం తప్ప అన్యమార్గాంతరం లేకుండా పోతోంది. ఏనుగు శరీర భాగాలను వేటికవే విడివిడిగా చూసి, ఆ సమాచారానుసారం ఆకారమేమిటో 'నిర్దిష్టం'గాచెప్పాలని ప్రయత్నించినట్టుంటుంది రచయిత జ్ఞాన ప్రదానం అనే రచన. కానీ, సహజ పాఠక వివేకంతో ఆ రచయితల నివేదికల్లోంచి (అనివార్యం కనుక 'A'uthorని హత్యచేసి మరీ) అసలు స్వరూపాన్ని గ్రహించే ప్రయత్నం చేయగలగాలి. సమాచారం, జ్ఞానం, వివేకం అనే మూడు మెట్ల సాయంతో తెలుసుకోవడమే, అర్థం చేసుకోవడం కాదని గ్రహించగలిగితే, ఆ గ్రహింపు అంతర్జ్వలనానికి, ఆ జ్వలనం సాహిత్య సృజనకు దారితీస్తాయని ఆధునిక రచనా మర్మాన్ని విప్పే ప్రయత్నం చేశారు తాత్వికులు.

(సశేషం)

# నార్లబాట

**- నాగసూరి వేణుగోపాల్**

నార్ల వెంకటేశ్వరరావు గారిలో ఏ లక్షణాలను మనం ఇపుడు అందుకోవాలి? - అని ఆలోచిస్తే నిరంతర శ్రమ - పఠనం, పరిశోధనం - విశాలమైన దృష్టి, శాస్త్రీయ దృక్పథం తర్వాత భాష, శైలి అని నేను భావిస్తున్నాను. కేవలం ఆయన రచనల ఆధారంగా మనకు నేడు ఏమి అవసరం అని మాత్రమే ఆలోచిద్దాం. నాకు నార్లతో వ్యక్తిగత పరిచయం కాదు గదా, కనీసం ఉత్తర ప్రత్యుత్తర సంబంధం గూడా లేదు. కేవలం అతని రచనలు చదివి, వాటితో ప్రేరేపించబడి నేను అభిప్రాయ పడుతున్నాను.

వేమన గురించి రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు అవలంభించిన ధోరణినే ఇక్కడ తీసుకుందాం. ప్రస్తుత సమాజానికి ఏ నార్లబాట అవసరమో అదే పరిగ్రహిద్దాం! నార్లగారి స్వంత గ్రంథాలయం చాలా పేరు గాంచింది. దాదాపు ఇరవై వేల గ్రంథాలు అందులో వున్నట్లు చెప్పేవారు. తర్వాత ఎవరి పర్సనల్ లైబ్రరీలోనూ అన్ని గ్రంథాలు లేవని అంటారు. రోజూ రాసే సంపాదకీయాలు, వ్యాసాల విషయం కాక, ప్రత్యేక సందర్భాలలో ఆయన రాసిన ఎడిటోరియల్స్ గమనించినా, 'సీతజోస్యం', 'జాబాలి' వంటి నాటిక పీఠికలు గమనించినా ఆయన పాండిత్యాన్ని శంకించలేం.

'మానవ విజయం' వంటి సంపాదకీయం రాయాలంటే ఎంత పాండిత్యం వుండాలి? మానవాళి సాధించిన ప్రగతిని ఒక పెద్ద పేరాలో నిబిడీకృతం చేయడం చిన్న విషయం కాదు. ఆ సంపాదకీయం చదివితే వళ్ళు పులకరిస్తుంది. కేవలం విషయ సంచయానికి అబ్బురపడి కాదు. తగిన సమయంలో మనకు మనం ఎలా స్ఫూర్తి తెచ్చుకోవచ్చో అన్న అద్భుత విషయాన్ని అలవోకగా, అర్థవంతంగా చెప్పినందుకు! కేవలం పాండితీప్రకర్ష చూపడమేకాదు. ఆ పాడిత్యపు అంతస్సూత్రమైన ఆలోచనను విశ్లేషించడం! 'జాబాలి' వంటి ఒక పాత్రను వివరించి ఆ పాత్ర ప్రవర్తనకున్న నేపథ్యాన్ని ఎలా విశ్లేషించాడు? ధీరువులయినవారు విపత్కర పరిస్థితుల్లో ఎలా తమను తాము ఖండించుకుంటారో వివరించడానికి చరిత్రలో శాస్త్రవేత్తల ధోరణులను తన సుదీర్ఘమైన పీఠికలో వివరించారు. ఈ విషయం గమనిస్తే నార్ల మేధ, ఆలోచనారీతి, పరిశ్రమ అవగత మవుతాయి.

ఈ లక్షణాలు యిపుడెందుకు అని అంటారా? మనకు వినిమయతత్వం, నిర్లిప్తత, పట్టించుకోక పోవడం- వంటి లక్షణాలు బాగా వంటబట్టాయి. టీవీ ఛానల్స్ తప్ప పుస్తకాలూ; హై - ఫై కోర్సులు తప్ప మౌలిక శాస్త్రాలూ, సామాజిక శాస్త్రాలు; షార్ట్‌కట్ తప్ప శ్రమా - కనబడడంలేదు. సీరియస్‌నెస్‌కు అసలు చిరునామా లేదని ఎంతో మంది భావిస్తున్నారు. అందువల్ల ఈ మేరకు శ్రమ, సాధన, శోధన చాలా అవసరం.

ఇక అవసరమైన రెండవ పార్శ్వం చూద్దాం. నార్ల 'జగన్నాటకం' అనేగేయ సంపుటి, 'నవయుగాల బాట' అనే పద్యశతకం రాశారు. 'కొత్తగడ్డ' అనే ఏకాంకికల సంకలనం వెలువరించారు. 'జాబాలి', 'సీతజోస్యం', 'నరకంలో హరిశ్చంద్రుడు, 'ద్రౌపది', 'హిరణ్యకశ్యపవధ' వంటి సంచలనాత్మక నాటకాలు రాశారు. వేమన, గురజాడ, వీరేశలింగంగార్ల జీవిత చరిత్రలు ఆంగ్లంలో సాహిత్య అకాడమి కోసం రాశారు. భగవద్గీత మీద ఆంగ్లంలో లోతయిన వ్యాసాలు రాశారు. దాదాపు ఆరు కథలు కూడా 'కదంబం'లో వున్నాయి. ఒక నవల అసంపూర్తిగా మిగిల్చారు. ఇక సంపాదకీయాలు, వ్యాసాలు,

సమీక్షలు, వ్యాఖ్యలు లెక్కలేనన్ని - ఇన్ని ప్రక్రియలు ఎందుకు చేపట్టాడు? 'నవయుగాలబాట' లో భావాలు, భాష, పదాల పొందిక చాలా గొప్పగా వున్నాయని, దాదాపు వేమన్నకే సరిసాటి అని రాళ్ళపల్లి వారి అభిప్రాయం. ఇక పరిశోధనాత్మక నాటికల గురించి కొత్తగా చెప్పక్కరలేదు. అంటే విషయానికి తగిన ప్రక్రియను ఎన్నుకోవడం అతని విశాల దృక్పథానికి చిహ్నం. అలాగే భాష విషయంలో కూడా - సాధ్యమైనన్ని ఎక్కువ సామెతలు, పలుకుబళ్ళు, అచ్చ తెనుగు పదాలు వారి శైలిని సుసంపన్నం చేశాయి. అలాగే సున్న వాడకం విషయంలో - వ్యక్తీకరణే ప్రమాణికంగా స్వీకరించారు. సాహితీ స్ప జన విషయంలో మనం ఈ రెండు విషయాలు ఎందుకు తీసుకోకూడదు? ఇపుడు మనం గ్లోబలైజేషన్ అంటూ వేలం వెర్రిగా పరుగులెత్తుతున్న - మనలో లుప్తమవుతున్న విశాల దృష్టికి గుర్తులు చాలా వున్నాయి. అందువల్ల నిజమైన ఓపన్‌నెస్ మనకు అవసరం. మరి ముఖ్యంగా సాహిత్య రంగంలోనూ, పత్రికా రంగంలోనూ ఈ ఓపన్‌నెస్ యింకా అవసరం.

తర్వాత సైన్స్, మూఢవిశ్వాసాలు, హేతువాదం వంటి అంశాలను 'నార్ల మాట' లుగా ఎంత హాయిగా, సరళంగా, స్పష్టంగా చెప్పారు? నేడు టెక్నాలజి పెరిగింది. ఇంటర్నెట్‌తో ప్రపంచం చిన్నగా అయ్యింది అని మనం భావిస్తున్నా జరుగుతున్నదేమిటి? కంప్యూటర్‌లలో జాతకాలు; టీవీల్లో బాబాలు, అవతారపురుషులు; ఇంటర్నెట్‌లో ఘరానా మోసాలు లేదంటే సెక్స్ - - యిదీ దృశ్యం. ఇటువంటి సమయంలో ఆలోచన, అవలోకన, శాస్త్రీయ దృక్పథం అవసరం లేదా? మీరు మరోసారి నార్ల పద్యాలు చదివి అభిప్రాయానికి రండి.

ఇక వ్యాసరచనలో ఎంత వైవిధ్యం? ఎత్తుగడ, పద్ధతీ, ఎంత సొంపుతో అలరారుతాయి? ఇపుడు ఫిక్షన్‌కు కాలం చెల్లింది, నాన్ ఫిక్షన్‌కు రోజులు అంటున్నపుడు - లెక్కలేనన్ని వ్యాసాలను అన్ని అంశాలమీద ప్రచురిస్తున్నపుడు నార్ల వ్యాసబాణిని సొంతం పరిశీలిస్తే పోయేదేం వుంది?

నార్ల రచనలు ఎందుకు అంటూ చేసిన విశ్లేషణ యిది. అంతకుమించి నార్లతో ముడిపడిన దృశ్యం వుంది. ఆయన 'ఆంధ్రప్రభ' సంపాదకులుగా వున్నపుడు పనిగట్టుకుని కమ్యూనిస్టుల మీద కార్టూన్లు వేయించాడు. అలాగే ఆయన సంపాదకత్వం వహించిన పత్రికలలో విశ్వనాధ సత్యనారాయణ, చలం రచనలు వేయలేదు. పని చేసిన రెండు పెద్ద పత్రికలను తీవ్ర విభేదాలతో తిరస్కరించి, బయటకు వచ్చారు. నార్ల వెళ్ళిపోయాక ఆ పత్రికలు ఆయన పేరు కూడా ప్రచురించకుండా జాగ్రత్తపడేవి. ఇక అతనితో పని చేసిన సహచరులు అతని మూడ్స్ భరించడం చాలా కష్టమని చెబుతారు. ఈ నేపథ్యంలో నార్ల రచనలు గానీ, నార్ల గురించి కానీ దాదాపు కనబడడం లేదు.

ఇటువంటి దృశ్యం మనం గమనిస్తున్నపుడు ఆయన రచనలు మొత్తం వెలుగులోకి రావాల్సిన అవసరం వుందనిపిస్తుంది. మరో విషయం - కొడవటిగంటి కుటుంబరావు రచనలు అన్నీ పుస్తకాలుగా వచ్చాయి. దాంతో పరిశోధనకు అలవాటుపడని, సులభదారుల్లో వెళ్ళే విశ్లేషకులు ఎంత లేదన్నా ఏటా నాలుగు, ఐదు విశ్లేషణలు రాస్తున్నారు. కానీ నార్ల వంటి వారి రచనల మీద రాసేవారు ఎవరు? అసలు ఆ పుస్తకాలు దొరికితే గదా? ఆయన రచనలు సత్వరం వెలువడాల్సిన అగత్యం ఎంతో వుంది.

అందువల్ల ఏ రకంగా చూసినా మనకు 'నార్లబాట' ఎంతో అవసరం!

# హిందూ మత సంస్కర్త దయానందసరస్వతి

**- శివలింగం**

స్వామి దయానంద సరస్వతి (1824-1886) ఆర్య సమాజ వ్యవస్థాపకుడు, హిందూమత సంస్కర్తల్లో చివరివాడు. సాంప్రదాయక శైవ కుటుంబంలో సౌరాష్ట్ర (పూర్వకథియవార్) లోని ఒక కుగ్రామంలో పుట్టాడు. శైవ భక్తుడిగా పెరిగాడు. ఆకాలం నాటికి స్థంకవాసి జైనుల ప్రభావం సమాజంలో బలంగావుంది. 1824లో మాధవగర్ సంస్కారణోద్యమం ప్రారంభించాడు. జైనులు విగ్రహారాధకులు కారు. మాధవగర్ శంకరవేదాంతి. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. అవతారాలను తిరస్కారించాడు. మరణించిన వారికి జరిపే శ్రాద్ధకర్మలను, దానాలను ఒప్పుకోలేదు. వృద్ధులకు, పేదలకు దానం చేయమన్నాడు.

దయానందుడు బాల్యంలో ఒక చిన్న సంఘటన జరిగింది. శైవాలయంలో ఒక రాత్రిజాగరణ చేశాడు. భక్తులందరూ వెళ్ళిపోయారు. అర్ధరాత్రి ఒక ఎలుకవచ్చి శివలింగంమీద మలమూత్రాలు విసర్జించింది. ఎలుకకు ఏమీ జరగలేదు. దేవుడు అనుకున్నది ఒక శిల. ప్రజలే దానికి దివ్యత్వం అంటగట్టారు. ఈ సంఘటన దయానందునిలో మార్పు తెచ్చింది. విగ్రహారాధన మీద విశ్వాసం సడలింది. అదొక మూఢాచారం అని తేలిపోయింది. అసలైన హిందూ మతం ఏమిటన్న ఆలోచన ఆరంభమయింది. తెలుసుకోవాలనే తపన పెరిగింది. సంస్కృత గ్రంథాలను అధ్యయనం చేశాడు. హిందూ మతానికి వేదాలే పరమ ప్రామాణికాలని భావించాడు.

ఇక్కడే దయానందుడు ఇతరులనుండి వేరు పడుతున్నాడు.

రాజారామమోహనరాయ్, జ్యోతిపూలె, గోపాల హరిదేశ్‌ముఖ్(లోకహితవాది) స్వామివివేకానంద వంటి బెంగాల్, మహారాష్ట్రకు చెందిన సంస్కర్తలందరూ స్వల్ప భేదాలున్నా ఒక్క వివేకానందుని మినహాయించి మిగతావారంతా పాశ్చాత్య సంస్కృతి సాహిత్యం, ఉదారవాదం నుండి ప్రాభావితులైన వారే ననడంలో సందేహం లేదు. వేదాలు ఉపనిషత్తుల కాలం నాటి ఆదర్శ సమాజాన్ని ఆధారం చేసుకుని తన కాలం నాటి హిందూ సమాజంలోని లోపాలను ఎత్తి చూపి సంస్కరించదలచిన ఏకైక ఆధునిక హిందూ సంస్కర్త దయానందుడు.

సంస్కర్తలో జ్యోతిరావ్ పూలె బ్రాహ్మణమతం మీద వీరోచిత పోరాటం చేశాడు. పూలె మాలి కులానికి చెందినవాడు. ఆనాటి బ్రాహ్మణులు పట్టించుకోలేదు. మహారాష్ట్రలో అదొక బలవత్తరమైన పోరాటోద్యమంగా రూపొందింది, హిందూ ధర్మశాస్త్రాలను క్షోదక్షంగా పరిశీలించాడు. వేదాలమీద సత్యార్థ ప్రకాశిక రాశాడు. విగ్రహారాధన చర్చ కాశీలో జరిగినపుడు పాల్గొన్నాడు.

హిందూ శాస్త్ర పరిచయం ఇతర సంస్కర్తలకు తక్కువ. దయానందుని అనుచరుల్లో ఎక్కువగా మధ్యతరగతి విద్యావంతులు, వృత్తి కార్మికులు, వ్యాపారులు. 1872 డిశంబరులో కలకత్తా వచ్చి 1874 ఏప్రిల్ ఒకటవ తేదీన వెళ్ళాడు. దేవేంద్రనాథ టాగూరు, కేశవచంద్రసేన్ తదితర ప్రముఖ బ్రహ్మసమాజీయుల్ని కలిశాడు. కలకత్తా ఆధునిక భావాలకు సంస్కరణోద్యమాల నిలయం. కేశవ చంద్రసేన్ ప్రబోధంతో హిందీ భాషను నేర్చుకుని తన భావాలను ప్రథమంగా హిందీ ప్రాంతాల్లో ప్రచారం చేశాడు. దయానందునికి ఆంగ్లంరాదు. కేశవ చంద్రసేన్‌కు సంస్కృతం రాదు. దయానందుడు అంతవరకు సంస్కృత భాషలోనే ప్రచారం చేశాడు. కలకత్తా సందర్శించాక బహిరంగ ఉపన్యాసాలలోను

రాతల్లోను ఒక క్రమ పద్ధతిని పాటించడం నేర్చాడు. శ్రుతి ప్రామాణికత మీద, సత్యం మీద విశ్వాసం సడల లేదు.

చాలా పుస్తకాలు కరపత్రాల ద్వారా ప్రచారం చేశాడు. ఖురాను, బైబిలు బ్రహ్మ సమాజ నాయకుల రచనలు చేశాడు. మత నైతిక విషయాల్లో దేవేంద్ర నాథటాగూర్, దయానందుని భావాలకు భేదం లేదు. మధురలో స్వామి విరజానంద (1860-63) వద్ద వ్యాకరణం మూడు సంవత్సరాలు అభ్యసించాడు. కలకత్తా సందర్శన కూడా ఆర్యసమాజాన్ని ఒక సజీవ సంస్థగా రూపొందించాలన్న భావం బలపడింది. అతీంద్రియ జ్ఞానం, భగవంతుని మీద విశ్వాసం వుంది. భగవంతుడు పరిపూర్ణుడు అవతారాలు ఎత్తాల్సిన అవసరం లేదు. మతానికి లౌకికతకు మధ్య భేదం వుందని ఆర్యధర్మం. కులాన్ని అంగీకరించలేదు. హిందూశాస్త్రాలు ధర్మం లౌకికస్వభావం కలిగించేవే నని పరిస్థితుల కనుగుణంగా ధర్మం మార్చుకోవాల్సిందేనన్నాడు. పురాణాలు స్మృతులు, ఇతిహాసాలు - వీటిని ప్రామాణికాలుగా అంగీకరించలేదు. ప్రాచీన ఋషులు వ్రాసిన ఆర్షశాస్త్రాలకు, అనార్ష గ్రంథాలకు భేదం వుందన్నాడు. అనార్షులు రాసిన గ్రంథాల్లో వర్గద్వేషం వుంటుంది. హిందూమతం క్షీణించడానికి కారణం అనార్ష రచనలు. ఆర్ష ఋషుల రచనల్లో విశ్వజనీనభావాలు. బాల్య వివాహాలను వ్యతిరేకించాడు. వితంతు వివాహాలను సమర్థించాడు. భృగుసంహిత - జ్యోతిష గ్రంథం - ను దూషించాడు. మాంసాహారాన్ని అనుమతించాడు. మానవులకు ఉపయోగపడే ఆవులు, దున్నలు, గొర్రెలు, మేకలు, ఒంటెల మాంసం వద్దన్నాడు. మత దృష్టితో కాదు ఆర్థిక దృష్టితో చెప్పాడు.

తినడం, తాగడం, ధర్మం - మూడింటికి సంబంధం లేదు. ధర్మం, అహింసలు మానసికాలు. తినడం, తాగడం బాహ్య చర్యలు.

అద్వైతాన్ని, వైష్ణవాన్ని ఒప్పుకోలేదు. త్రైతవాదాన్ని బోధించాడు. అంటే భగవంతుడు ప్రకృతి జీవుడు. కరుణామయుడు సమర్థుడైన రాజు కింద భారతదేశం ఒకటిగా వుండాలన్న ఆదర్శభావన.

విద్య విషయంలో వివేకానందుడు దయానందుడు ప్రాచీన విద్యకే అంకితమయారు. దయానందుడు అరడజను పాఠశాలలు స్థాపించాడు, కలకత్తా వెళ్లకముందే. సత్ఫలితాలివ్వలేదు. తరువాత కొంచెం సడలించి ఆధునిక విషయాలతో పాటు మత విశ్వాసాలను కూడా బోధించారు.

1875లో ఆర్య సమాజం పుట్టింది. పంజాబు, ఉత్తర ప్రదేశ్‌లలో వ్యాప్తిచెందింది. వివేకానందుడు హిందువుల ఆత్మ గౌరవాన్ని ప్రాచీన సంస్కృతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు. ముస్లిముల పాలన నుండి విముక్తి. పాశ్చాత్య చింతన ప్రవేశిస్తున్న కాలం. ముస్లిములు హింసించారు. రెండో తరగతి పౌరులుగా గుర్తించారు కాని హిందువులు సాంస్కృతికంగా ముస్లింల కంటే తక్కువ వారమనే భావనను కలిగించడంలో విఫలమయారు.

హిందూ మతం క్షీణించిందని సంస్కర్తలందరూ భావించారు. వివేకానందుడు, దయానందుడూ గత ప్రాభవ స్ఫూర్తితో హిందూ సమాజాన్ని పునర్నిర్మించాలని తపన పడ్డారు. అన్నీ వేదాల్లోనే వున్నాయని ఇరువురూ అన్నారు. ఇద్దరూ సన్యాసులే కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించారు. ఆధునిక సమాజ సౌధ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు కారు. ఇరువురూ స్వేచ్ఛావాదులు, క్రియాశీలురు, లోకంతో కలిసినవాళ్ళు, సన్యాసి అయినా సరే లోకం నుండి తప్పించుకోడానికి ప్రయత్నించ వద్దన్నాడు. దయానందుడు హైందవమత శుద్ధతను పరమార్థం చేసుకున్న సంస్కర్త.

# ఆధునికానంతర మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త జాక్‌లకా

**- బి. తిరుపతిరావు**

పంతొమ్మిది వందల అరవైలలో ప్రపంచ వ్యాప్తంగా తాత్వికరంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు మనో వైజ్ఞానిక శాస్త్ర రంగానికి కూడా విస్తరించాయి. మార్క్సిస్టులు కూడా ఈ కాలంలోనే మనో వైజ్ఞానిక శాస్త్రాన్ని సీరియస్‌గా పట్టించుకోవటం మొదలు పెట్టారు. ప్రముఖ మార్క్సిస్టు తాత్వికుడు లూయి అల్థూజార్ 'ఫ్రాయిడ్ అండ్ లకా' (చూ. Lenin and Philosophy and other Essays) అనే వ్యాసంలో మార్క్స్, ఫ్రాయిడ్‌లు ఇద్దరూ రెండు కొత్త శాస్త్రాల్ని కనుగొన్నారని, సామాజిక అంశాల్ని అర్థం చేసుకోవటానికి కొత్త పద్ధతుల్ని రూపొందించారని అన్నాడు. అయికతే మార్క్స్, ఫ్రాయిడ్‌లు ఇద్దరూ తమ కాలపు సాంస్కృతిక భారం నుండి తప్పించుకోలేకపోయారు. విషయి (Subject) గురించిన హెగెల్ ఆలోచనల ప్రభావం నుంచి మార్క్స్ తన భావాలకి రూప కల్పన చేస్తే, ఫ్రాయిడ్ తన ప్రతిపాదనల్ని జీవశాస్త్ర సహాయంతో చేశాడు. ఈ నేపథ్యాన్ని గుర్తించి తాను హెగెల్ ప్రతిపాదించిన అఖండ విషయి ప్రస్తావన లేకుండా మార్క్సిజాన్ని పునర్ నిర్మించే ప్రయత్నం చేస్తున్నానని, సరిగ్గా తన లాంటి ప్రయత్నానే జాక్ లకా (Jacques Lacan) మనో వైజ్ఞానిక శాస్త్రంలో ఐక్య అహం (unified self) గురించిన భావనకి అతీతంగా ఆలోచించటం ద్వారా చేస్తున్నాడని ప్రకటించాడు అల్థూజార్. అల్థూజార్ ప్రకటనకి చారిత్రక ప్రాధాన్యత వుంది.

మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని సమూలంగా పునర్ వ్యాఖ్యానిస్తూ ఫ్రాన్సు నుంచి వచ్చిన ఆధునికానంతర వాదుల్లో లకా ప్రముఖుడు. ప్రసిద్ధి చెందిన బహిరంగ ఉపన్యాసాలు, సెమినార్లు, సంక్లిష్టమైన రచనలతో లకా ఆధునికానంతర మనో వైజ్ఞానిక శాస్త్రానికి రూపకల్పన చేశాడు. ఫ్రాయిడ్ మార్గంలోనే బయలు దేరిన లకా మనోవైజ్ఞానిక శాస్త్రంలోని అనేక మౌలిక భావనల్ని తిరగరాసి వాటిలో తాత్విక, సామాజిక, సాంస్కృతిక, భాషా శాస్త్ర రంగాల్ని సంలీనం చేశాడు. నిర్మాణవాద, ఉత్తర నిర్మాణవాద భాషా శాస్త్రాల ప్రభావం లకా పై చాలా తీవ్రంగా వుంది.

మనో విశ్లేషణలో సంప్రదాయ పద్ధతుల్ని తీవ్రంగా ఖండించాడు లకా. ఈ ఖండన లకాని ఫ్రాయిడ్ వాదుల నుంచి దూరం చేసింది. 'The Function and Field of Speech and Language in Psychoanalysis' (ఈ రచన Discourse of Rome గా ప్రసిద్ధి చెందింది) అనే రచనతో ఈ దూరం మరింత పెరిగింది. అంతర్జాతీయ ఫ్రాయిడ్ వాదుల సంఘం నుంచి లకాని బహిష్కరించారు.

తన ప్రధాన ప్రేరణ ఫ్రాయిడ్ అని లకా చెప్పుకున్నప్పటికీ ఇద్దరి మధ్య మౌలిక వ్యత్యాసాలే వున్నాయి. ముఖ్యంగా అహం, అచేతనం, స్వప్నం, ఈడిపస్ కాంప్లెక్స్ మొదలైన వాటిని భావనీకరించటంలో ఇద్దరి అభిప్రాయాల్లో పొంతన లేదు. ప్రారంభంలో ఫ్రాయిడ్ అహాన్ని వాస్తవికత సూత్ర (Reality Principle), అచేతనాన్ని సౌఖ్యసూత్ర (Pleasure Principle) సంబంధంలో చూశాడు.

ఆ తరువాత దీన్ని పునర్ నిర్మిస్తూ తల్లిదండ్రుల మూర్తుల (Paternal figures) తో గుర్తింపుద్వారా అహం రూపొందుతుందని ప్రకటించాడు. అహం అనేది భ్రమ అని ఫ్రాయిడ్ ఎక్కడా ప్రకటించలేదు.

లకా ఈ పై విషయాల్లో ఫ్రాయిడ్‌కి భిన్నంగా ఆలోచిస్తాడు. లకా దృష్టిలో ఫ్రాయిడ్ వ్యక్తి ఒత్తుడులు (drives) లేక వాంఛలు, వాటిని సంతృప్తి పర్చే వాటి గురించి చెప్తూ సామాజిక దృక్కోణాన్ని పూర్తిగా విస్మరించాడు. విషయికి విషయికి మధ్య వుండే సంబంధం లేక అంతర్ విషయత్వం (intersubjectivity) గురించి ఫ్రాయిడ్ ఆలోచించలేదు.

మనోవిశ్లేషణ లక్ష్యం ఒక ఒత్తిడి (drive) ని అహపు సామరస్య స్థితిలో సమైక్య పర్చటంగా ఫ్రాయిడ్ భావించాడు. లకా అసలటువంటి పదబంధమే ఉపయోగించడు. ఫ్రాయిడ్ దృష్టిలో అచేతనం ప్రమాదకారి. అచేతనాన్ని సత్యానికి, ప్రామాణికతకి కేంద్ర బింధువుగా చూస్తాడు లకా.

ఫ్రాయిడ్ అచేతనాన్ని రూఢీపర్చబడిన భావనగా చూసాడు. లకా ప్రకారం అచేతనం వేరొక ప్రపంచపు వాస్తవిక రంగం కాదు. అసలు అచేతనం సహజాత సంబంధమైంది కాదు. అది మనం చెప్పే ప్రతిమాటలోనూ, చేసే ప్రతి పనిలో అంతర్లీనంగా వుంటుంది. దాన్ని గ్రహించే క్రమంలో మనం దాన్ని కోల్పోతూ వుంటాం. అచేతనాన్ని పూర్తిగా తెలుసుకోవటం ఎప్పుడూ జరగదు. అంతమాత్రం చేత మనం చేసే ప్రయత్నం వ్యర్థం కాదు.

అచేతనంతో కూడివుండే అతార్కిక ఆలోచన, చేతనతో కూడి వుండే తార్కిక ఆలోచన అనే రెండూ ఫ్రాయిడ్ ప్రతిపాదనల్లో కీలకం. వీటిని ప్రాథమిక క్రమం (Primary Process), ద్వితీయక్రమం (Secondary) అంటారు. క్లిష్ట సమయాల్లో మనిషి వాస్తవికత నుంచి పారిపోయి భ్రమల్లో లేక స్వైర కల్పనల్లో విహరిస్తాడు. తద్వారా నిస్పృహ నుంచి బయట పడతాడు. కొంత సమయం తరువాత మనిషి అస్తిత్వం కొనసాగించటం కోసం వాస్తవిక సూత్రం రంగం మీదకి వస్తుంది. అహం స్వైర కల్పనల్నించి బయట పడేస్తుంది. ఈ క్రమం నిరంతరం అచేతనం చేత భంగపర్చబడుతూ వుంటుంది. మనిషి హేతుబద్ధత సున్నితమైంది. దీన్ని అచేతనం నిరంతరం ధ్వంసం చేస్తూ వుంటుంది. ఫ్రాయిడ్ ముందుకు తెచ్చిన ఈ వాదనని నిరాకరిస్తూ అచేతనం సహజాత సంబంధి కాదని, ద్వితీయ క్రమం కూడా ప్రాథమిక క్రమం లాంటిదేనంటాడు లకా.

ఫ్రాయిడ్ ప్రకారం స్వప్నంలో మొదటి క్రమం పనిచేస్తూ వుంటుంది. అచేతనానికి రాజమార్గం స్వప్నమే. లకా ప్రకారం స్వప్నం చిత్ర ప్రదర్శ కాదు. ప్రతిమలతో కూడుకుని వున్నప్పటికీ స్వప్నంకూడ ఒక వాచకమే. స్వప్నంలోని ప్రతిమలు బహుళార్థాల్ని కలిగి వుంటాయి. అందువల్ల స్వప్నానికి అర్థం ఇదీ అని నిర్దేశించటం జరుగదు. వాచక విశ్లేషణలో మనం వర్తింపజేసే అన్ని లక్షణాలు స్వప్న విశ్లేషణకి కూడా వర్తిస్తాయి. అందువల్ల ఒక కలకి అర్థం ఇదే అని నిర్వచించటం తప్పు.

ఫ్రాయిడ్ ప్రకృతి - సంస్కృతుల మధ్య సంబంధాన్ని చర్చిస్తూ అంతిమంగా ప్రకృతి మీద సంస్కృతి యొక్క ఆధిపత్యాన్ని నొక్కి చెప్పాడు. ప్రకృతి బాహ్య వాస్తవికత అయినప్పటికీ దాన్ని

దాని స్వఛ్ఛ స్థితిలో గ్రహించటం అసాధ్యం, ఎందుకంటే దాన్ని గ్రహించటం భాషద్వారా మాత్రమే జరుగుతుంది అంటాడు లకా. అలాగే లకా సహజసిద్ధ మానవ ప్రవృత్తి భావనని నిరాకరిస్తాడు. ప్రకృతి - సంస్కృతుల సంఘర్షలేక విభజనలో అనివార్యంగా వుండే విషాదాన్ని ఫ్రాయిడ్ ప్రస్తావిస్తే, సంపూర్ణత్వం అనేది నిరంతరంగా లేకపోవటం అనే దాంట్లో విషాదముందంటాడు లకా.

ఈడిపస్ కాంప్లెక్స్ సంబంధించిన ఫ్రాయిడ్ భావనల్ని సరిదిద్దే ప్రయత్నం చేశాడు లకా. ఈ డిపస్ కాంప్లెక్స్‌ని ఫ్రాయిడ్ మరీ శాబ్దికంగా **(literal)** భావిస్తే లకా ప్రతీకాత్మకంగా తీసుకుంటాడు. తండ్రి పాత్రని ఫ్రాయిడ్ వాస్తవంగా, సశరీరంగా చూస్తే లకా భాషలో చూస్తాడు. తండ్రి చట్టానికి ప్రతీక. ఫ్రాయిడ్ ఆలోచనంతా భౌతికాంశాన్ని కేంద్రంగా చేసుకుని నడిస్తే, లకా ప్రతీకాత్మకతని ప్రాతిపదిగా చేసుకున్నాడు. శిశ్నాన్ని గురించి **(Penis)** శాబ్దకంగా చర్చిస్తే, లకా శిశ్న ప్రతీక **(Phallus)** గురించి ప్రస్తావిస్తాడు. **"...The phallus is the signifier of an original desire for a perfect union with the other. She phallus referes to plentitude; it is the signifier of the wholeness that we lack"**. అంటాడు మదన్ సరూప్ అనే ఆయన.

హేతుబద్ధ ప్రవచనం, తరచూగా వికృతీకరించబడినప్పటికీ, సాధ్యమంటాడు ఫ్రాయిడ్. లకా ప్రకారం ప్రవచనం అచేతనాన్ని స్థాపిస్తుంది. భాష, వాంఛ పరస్పర సంబంధంలో వుంటాయి. వాంఛ అనేది కేవలం లైంగిక శక్తి **(sexual force)**గా కంటే సంపూర్ణత్వం కోసం జరిగే సంఘర్షణగా చూస్తాడు లకా, అందువల్ల వాంఛ అనేది ఆంటలాజికల్‌గా కూడా వుంటుంది. ఫ్రాయిడ్ నిరంతరం సహజాతాలు, ఒత్తుడుల గురించి మాట్లాడితే లకా వాంఛల్ని ప్రస్తావిస్తాడు.

లకా సిద్ధాంతానికి ఫ్రాయిడ్ ఆలోచనలకి మధ్య నున్న విభిన్నతల్ని ప్రక్కన పెడితే లకా ఎప్పుడు ఫ్రాయిడ్ ప్రాధాన్యతని నిరాకరించలేదు.

పంతొమ్మిదివందల అరవై ఎనిమిదిలో ఫ్రాన్సులో జరిగిన మే ఉద్యమం విముక్తిదాయక రాజకీయాలు విముక్తి చెందిన వ్యక్తుల పరస్పర సంబంధంలోంచి రూపొందుతాయనే భావం బలంగా ప్రచారమయింది. ఈ ప్రచార నేపథ్యంలో లకా మనోవైజ్ఞానిక శాస్త్రంలో ఆసక్తి పెరిగింది. స్వయం వ్యక్తీకరణ, వాంఛ, లైంగికత మొదలైన వాటిగురించిన లకా సిద్ధాంతాలు ప్రజల్ని విశేషంగా ఆకర్షించాయి. మార్క్సిజాన్ని, అస్తిత్వవాదాన్ని సమన్వయం చేసే ప్రయత్నాలు సఫలం కాని నేపథ్యంలో అహం యొక్క భాష, సామాజిక నిర్మాణాల గురించిన లకా సిద్ధాంతం చాలా ఎక్కువ ప్రభావాన్నే చూపింది. వ్యక్తి - సమాజాల మధ్య సంబంధాల గురించిన పునరాలోచనలు మొదలయ్యాయి.

సమాజానికి, అహానికీ మధ్య విభిన్నతలేదు. భాషని వినియోగించే క్రమంలో మనుష్యులు సాంఘీకరింపబడతారు. వాళ్ళని పౌరులుగా ప్రతిష్టించేది భాషే, అందువల్ల వ్యక్తులకి, సమాజానికి మధ్య బేధం చూపటంలో అర్థం లేదు.

జీవశాస్త్రాన్ని ఆధారం చేసుకుని కొనసాగుతూవున్న మనోవైజ్ఞానిక శాస్త్రం మీద లకా తీవ్ర దాడి చేశాడు. ఉదాహరణకి 1930లో పిచ్చితనం శరీర సంబంధ కారణాలవల్ల ఏర్పడుతుందని భావించారు. పిచ్చితనాన్ని శరీరాన్ని కేంద్రం చేసుకుని వ్యాఖ్యానించటం కుదరదు, ఎందుకంటే అదికూడా ఒక ప్రవచనమే. అది కమ్యూనికేట్ చేయటానికి చేసే ప్రయత్నం. అందువల్ల దాన్ని ఒక ప్రవచానాన్ని వ్యాఖ్యానించినట్లుగానే వ్యాఖ్యానించాలి. అలాగే వ్యక్తి మూర్తిమత్వం అంటే కేవలం మనస్సు (mind) కాదు, మొత్తం మనిషి. వ్యక్తి మనస్తత్వాన్ని ఆ వ్యక్తి వ్యక్తిగత చరిత్ర నుంచి విడదీసి చూడకూడదు అని వాదించాడు లకా.

నిజానికి ఫ్రాయిడ్ తన ప్రతిపాదనల్లో ఎక్కువ బాగం జీవశాస్త్ర పరిభాషలో చేయటం కన్పిస్తుంది. **Ellie Ragland - Sullivan** అనే ఆమె ఇలా అంటారు. **"In much the same way that Darwianians saw nature, Frved viewed the dynamics of the human mind in the light of the competitive struggle for existence that prevailed in nineteenth - century industrial Europe. It is therefore not surprising that Frued's classic psychoanalytic theory is first and foremost a biological psychology of innate for ces." (P-70)** లకా ప్రకారం శరీరాన్ని కూడా మనం వ్యాఖ్యానిస్తాం. ఈ వాఖ్యానం భాష ద్వారా జరుగుతుంది. కాబట్టి భాషకి వెలుపల, భాషకి ముందు శరీరమనేది లేదు. కనీసం శరీరాన్ని గురించిన ఎరుకలేదు. అన్ని వర్ణనలను శరీర, అవయవస్థాయి నుంచి వేరు చేసి ప్రతీకాత్మక రంగంలోకి తీసుకెళతాడు లకా. సంస్కృతి అనేది శరీర అవయవాలకి అర్థం ఎలా విదిస్తుందో చూపిస్తాడు లకా.

ఫ్రాయిడ్ ప్రేరణతో నడిచిన సంప్రదాయ మనోవైజ్ఞానిక శాస్త్రం చేతనని ప్రాధమికం చేసి దాన్ని హేతుబద్ధత నిండినదిగా ప్రకటించి అచేతనాన్ని జంతు సదృశ్యమైన వాంఛలు నిండివుండే అతార్కిక రొంపిగా చూసింది. ఇందుకు పూర్తి భిన్నంగా లకా అచేతనపు ప్రాముఖ్యతని గుర్తిస్తాడు. సంప్రదాయ మనో వైజ్ఞానిక శాస్త్రం మనో విశ్లేషణని **Human engineering** స్థాయికి కుందించిందని లకా అభిప్రాయం. ఈ సందర్భంలో రిచర్డ్ కెర్నె అనే ఆయన అభిప్రాయం ఇది: **"moeoner, orthodox psychology championed ego of rational adoptaion what Lacan refers to the cult of the 'normal man' - against the non-conformist desires of a school of 'human engineering' whose primary purpose was to produce eminently adoptable citizens with reinforced cognitive egos that are virtually autonomous."**

సంప్రదాయ మనోవైజ్ఞానిక శాస్త్రం దృఢమైన అహన్ని (Strong ego) గొప్ప సానుకూల అంశంగా చూసింది. ఇలా చూడటం నార్సిజానికి ప్రతీకగా భావించాడు లకా. 'ఈగో సైకాలజీ' ఫ్రాయిడ్ భావనల్ని కుదించారని లకా ఆరోపణ. చైతన్య పూరిత భ్రమల్నించి విషయిని విముక్తి చేసి విముక్తదాయకమైన అచేతనా ప్రపంచపు భాషని తిరిగి పొందటం ఫ్రాయిడ్ లక్ష్యమని, అయితే ఈ ప్రతిపాదనని ఈగో సైకాలజిస్టులు తప్పుగా వ్యాఖ్యానించారని లకా ప్రకటించాడు.


మనో విశ్లేషకుడ్ని ఉపాధ్యాయుడుగా చూడటాన్ని, మనో విశ్లేషణని వైద్య శాస్త్రీకరించటానికి లకా వ్యతిరేకి. ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని జీవశాస్త్ర నియతి వాదం నుంచి బయటపడేసి విస్తృతమైన సాంస్కృతిక నమూనాల్లోంచి వ్యాఖ్యానించే ప్రయత్నం చేయాలని లకా ప్రతిపాదించాడు. అచేతనపు భాషా నిర్మాణాల్ని అవగతం చేసుకోవటం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుందని లకా అభిప్రాయం.

ప్రవర్తనావాద, మానవతావాద మనోవైజ్ఞానిక శాస్త్రాలు సారాంశంలో వ్యక్తులు సమాజంలో తమతమ ఆర్థిక, సామాజిక విధుల్ని నిరభ్యంతరంగా, ఏమాత్రం అసమ్మతిలేకుండా నిర్వర్తింపజేయటానికి ఉపయోగపడ్డాయి. వ్యక్తికీ, సమాజానికి మధ్య ఏమాత్రం సంఘర్షణ లేకుండా చూడటంలోనూ, వ్యక్తిని అమలులో వున్న సామాజక వ్యవస్థల్ని యధాతదంగా ఆమోదించేటట్టు చేయటంలోనూ ఫ్రాయిడ్ మనో వైజ్ఞానిక శాస్త్రాలతో పాటు మానవతావాద వైజ్ఞానిక శాస్త్రాలు అమెరికా లాంటి చోట్ల ప్రముఖ పాత్రనే నిర్వర్తించాయనేది లకా ఆరోపణ. ఈ నేపథ్యంలోనే లకా మనో వైజ్ఞానిక శాస్త్రాన్ని ఆత్మిక నియంత్రణకి సాధనంగా చూపటాన్ని తిరస్కరించాడు. ఈగోని స్వయం రక్షితమైనదిగా, దుర్భేద్యమయినదిగా చూడటాన్ని నిరాకరిస్తూ సంపూర్ణ మూర్తిమత్వం **(Total Personality)** రూపొందటం అసాధ్యమన్నాడు. సంపూర్ణ మూర్తి మత్వ స్థానంలో అచేతనపు భాషా లోతుల్లోని బహుళార్థాల క్రీడని ముందుకు తెచ్చాడు. **'Ecrits'** అనే రచనలో లకా ఇలా అంటాడు: **'If we forget the self's radical excentricity to itself with which man is confronted.... we shall falsify both the order and the methods of psychoanalytical mediation'.**

మానవతావాద సంప్రదాయంలో మానవ అహాన్ని స్థిరమైనదిగా, స్వేచ్ఛ, హేతుబద్ధతతో, స్వయం నిర్దేశికతలో వుండేదిగా భావించటం జరిగింది. అహాన్ని ఇలా స్థిరమైనదిగా చూడటాన్ని ఫ్రాయిడ్ కూడా నిరాకరించాడు. అహాన్ని విభజనతో **(split)** వుండేదిగా చూశాడు ఫ్రాయిడ్. అయితే అచేతనా ప్రపంచపు విషయాల్ని చేతనలోకి తీసుకురావటం ద్వారా న్యూరాసిస్‌ని, దమనాన్ని **(repression)** తగ్గించవచ్చునని ఫ్రాయిడ్ భావించాడు. అచేతనాన్ని శక్తి వంతమైనదిగా చేయటం ఫ్రాయిడ్ లక్ష్యం. లకా ప్రకారం ఇది అసాధ్యం. అహం ఎప్పుడూ అచేతనపు స్థానాన్ని చేరుకోవటం కానీ, దాన్ని నియంత్రించటం కానీ జరుగదు. అసలు అహం అనేది ఒక భ్రమ. ఒక రకంగా అహం అచేతనం యొక్క వుత్పత్తి. నిజానికి సమస్త అస్తిత్వానికి భూమిక అచేతనమే.


ఫ్రాయిడ్ శిశువు అచేతనాన్ని, అహాన్ని ఎలా రూపొందించుకుంటుందో? ఎలా నాగరీకరింపబడుతుంది? అనే విషయాల్ని చర్చిస్తే, లకా ఒక శిశువులో 'అహం' లేక 'నేను' (I) అనే భ్రమ ఎలా రూపొందుతుంది? అనే ప్రశ్నని చాలా వివరంగా చర్చించాడు. దర్పణ దశ **(Mirror Stage)** గురించిన వివరణలో ఈ విషయం స్పష్టంగా చర్చించాడు లకా. ఆ విషయాన్ని కొంచెం ఆగి చుద్దాం.

(సశేషం)



**Dr Lulu Skidmore poses with Rama the cama, the first ever cross between a camel and a llama, while an attendant holds on to the parents of the new animal in Dubai. The camel and the llama descend from the same species that lived 30 million years ago.**

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



**విభాజిత జీవితాలు**

బ్రిటన్ మురికివాడల్లో నివసించే వారిలో అధిక సంఖ్యాకులు ద్రవ్యోల్బణం కారణంగా పేదరిక రేఖకు దిగువకు విసిరి వేయబడ్డారు. కాని కొందరికి ఇది వరమే అయింది. థామస్ డగ్‌డేల్ చిత్రించిన "Arrival of the Jarrow" ఉన్నత వర్గాలు వీరి యెడ చూపించే నిర్లిప్తతను ప్రదర్శిస్తుంది.

చిత్రకారుడు : **యల్.యస్.లోరి**